
Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03 నెల్లూరు, 22.07.2016, శుక్రవారం సంపుటి : 36 సంచిక : 07 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com



- నెల్లూరుపై 'నారాయణ' బాంబులు
- లబోదిబోమన్న బాధితులు
- నోర్లు తెరవని లంచావతారాలు
- నాయకులు, అధికార్లను నమ్మి మోసపోయిన భవన యజమానులు



# గుండెల్లో గునపాలు

ఎవరి పాపాలకు ఎవరు బాధితులు? ఎవరి అవినీతికి ఎవరు బలవుతున్నారు? ఎవరి అహంకారానికి ఎవరు మూల్యం చెల్లిస్తున్నారు? తప్పులు చేసేది, తప్పుడు పనులు చేయించేది పాలకులు, అధికారులూ... శిక్షలు అనుభవించాల్సింది ప్రజలా? ఓట్లేయించుకున్నదాకా ఓ పాట...? ఓట్లేయించుకున్నాక ఇంకో మాట...? మీకు ఓట్లేసింది, మీ పార్టీని అధికారంలోకి తెచ్చింది విధ్వంసాలు సృష్టించడానికా? అవినీతి విన్యాసాలు పుట్టించడానికా?

(మిగతా 11వ పేజీలో)



## మంకుపట్టు మంత్రి

- కంపుపట్టిన జిల్లా దేశం

నెల్లూరులో అక్రమ కట్టడాల కూల్చివేతపై మంత్రిగా నారాయణ చాలా మొండి పట్టుదలకు పోయాడు. తనపై, అలాగే కార్పొరేషన్‌పై వస్తున్న ఆరోపణలను సైడ్ చేసేందుకే ఆయన ఈ పంచాయితీ పెట్టుకున్నాడు. ఉన్నఫళంగా కట్టుకున్న భవనాలను కూలిస్తే పార్టీకి

(మిగతా 11వ పేజీలో)



## మేయర్, షాడోమేయర్ C/o డి.ఆర్

నెల్లూరు మున్సిపల్ చరిత్రలోనే ఎన్నడూ లేనంతగా ఇప్పుడు కార్పొరేషన్‌లో అవినీతిని పాలకులు బహిరంగం చేశారు. మేయర్, షాడోమేయర్‌గా వ్యవహరించే అతని తమ్ముడు తమ అవినీతి కార్యకలాపాలకు డి.ఆర్ హోటల్‌ను కేరాఫ్ అడ్రస్‌గా మార్చుకున్నారు. సాయంత్రమైతే అక్కడకు చేరుతారు. ఫైళ్లన్నీ అక్కడికే చేరతాయి. అధికారులు, సిబ్బంది అక్కడికే వెళ్లాలి. రేట్లు అక్కడే సెట్ కావాలి. ఇది అందరికీ తెలిసిన బహిరంగ రహస్యమైపోయింది. ఏ భవన యజమాని నుండి ఎంత కలెక్షన్ దండారన్నది కూడా నగరంలో బహిరంగ

(మిగతా 11వ పేజీలో)




## కాంగ్రెస్... పాప ప్రక్షాళన?

- ఎంత చేసినా ఏపిలో మనుగడ కష్టమే!

**చేసిన పాపం ఊరికే పోదంటారు. అయితే, ఇది వ్యక్తులకే కాదు, రాజకీయపార్టీలకు సైతం వర్తిస్తుండడమే విచిత్రం. ఈ దేశ చరిత్రలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి జరిగినంత అన్యాయం ఏ రాష్ట్రానికి కూడా జరిగి ఉండదు.**

2014లో ఆంధ్రప్రదేశ్ నుండి తెలంగాణను విభజిస్తూ ఆనాటి యూపిఏ ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బిల్లు ఎంత నీచనికృష్టంగా, ఎంత దరిద్రంగా, ఎంత దుర్మార్గంగా వుందో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఆరోజు కాంగ్రెస్ అధినేత్రి సోనియా తెలంగాణను సొంత బిడ్డలా, ఏపిని సవతి బిడ్డలా చూసింది. తెలంగాణకు పట్టుబట్టలు కట్టించి, ఏపిని గోచిగుడ్డతో రాజధాని కూడా లేకుండా రోడ్డు మీద నిలబెట్టింది. ఏపి పట్ల కాంగ్రెస్ ఇంత కిరాతకంగా వ్యవహరించింది కదా, మిగతా పార్టీలన్నా కరుణచూపాయా అంటే అదీ లేదు. బీజేపీ వంటి ప్రతిపక్షంతో పాటు తెలుగుదేశం, వైకాపా, సిపిఐ వంటి పార్టీలు కూడా ఏపినే వంచించాయి.

ఇంత దారుణమైన విభజన పాపంలో ప్రధాన ముద్దాయి కాంగ్రెస్ అయితే, రెండో ముద్దాయి బీజేపీనే! మీరు బిల్లు పెడితే మేం వద్దంటామా అంటూ కాంగ్రెస్‌ను రెచ్చగొట్టింది వాళ్లే! తీరా బిల్లు పెట్టాక ఏపికి అన్యాయం చేస్తున్నారంటూ గగ్గోలు పెట్టింది కూడా ఈ బీజేపీ వాళ్ళే! మేం అధికారంలోకి వస్తే ఏపికి పరిపూర్ణ న్యాయం చేస్తామన్నది వీళ్ళే! అధికారంలోకి వచ్చాక

(మిగతా 11వ పేజీలో)

# బళ్లలో మోగిన ఎన్నికల గంట

## • పసుపు చొక్కాలకు పదవుల జాతర

ప్రభుత్వ పాఠశాలలో చదువులు చట్టుబండలవుతున్నాయి. పాచీ పని, మట్టి పని చేసుకునే సన్న చిన్న పేదలు కూడా తమ బిడ్డలను సర్కార్ బళ్లకు పంపడం లేదు. తాము పస్తులుండి సంపాదించిన నాలుగు రూపాయలను తమ బిడ్డల చదువులుకే ఖర్చు చేస్తూ ప్రైవేట్ స్కూళ్లలో చేర్పిస్తున్నారు. అయితే వేలకు వేలు ఫీజులు కట్టి ప్రైవేట్ స్కూళ్లలో చదివించాలన్నది ఎవరికీ ఫ్యాషన్ కాదు. కాని సర్కార్ బళ్లలో చదువులు అంతంత మాత్రంగా ఉంటున్నాయి. గవర్నమెంట్ బడుల్లో చదివితే తమ బిడ్డలు ఎక్కడ ర్యాంకుల్లో, మార్కుల్లో వెనుకబడిపోతారోననే భయంతో ప్రైవేట్ స్కూళ్లలో చేర్పిస్తున్నారు. అయితే ఇక్కడ ట్విస్ట్ ఏంటంటే రాష్ట్రంలో ప్రభుత్వ విద్యను నామరూపాలు లేకుండా చేస్తున్న కార్పొరేట్ విద్యా సంస్థల అధిపతులు రాష్ట్ర కేబినెట్‌లో మంత్రులుగా ఉండడం. రాష్ట్రంలో ప్రభుత్వ విద్యను బ్రతికించాలంటే చాలా మార్గాలున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు మెరుగు పరచడంతో పాటు అన్ని సబ్జెక్టులకు పూర్తి స్థాయిలో ఉపాధ్యాయ నియామకాలు జరగాలి. విద్యావిధానంలో వస్తున్న మార్పులను ఈ బళ్లలో ప్రవేశపెట్టాలి. అలాగే ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలకు సంబంధించిన ఉపాధి అవకాశాలలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు ప్రత్యేక కోటా అమలు చేయాలి. కాని ప్రభుత్వం అటువంటివేవీ అమలు చేయడం లేదు.

కాని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక విద్యను బలోపేతం చేయడానికంటూ పాఠశాల యాజమాన్య కమిటీలకు ఎన్నికలు పెట్టబోతోంది. ఇది ఒక రకంగా తెలుగుతమ్ముళ్లకు పదవుల పందేరం వంటిదే!

తెలుగుదేశం అధికారంలోకి వచ్చాక నామినేటెడ్ పదవుల కోసం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎగబడుతున్నారు. అయితే అందరికీ పదవులు లేవుగా! అందుకే స్కూల్ యాజమాన్య కమిటి పదవులను సృష్టించారు. ప్రాథమిక పాఠశాల, ప్రాథమికోన్నత పాఠశాల, ఉన్నత పాఠశాలల వారీగా పాఠశాల యాజమాన్య కమిటీలను ఎన్నుకోనున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు సర్పంచ్, వార్డు సభ్యులు, ప్రధానోపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎక్స్ అఫిషియో సభ్యులు, కో-ఆప్షన్ సభ్యులు వుంటారు. జిల్లాలో మొత్తం 2648 ప్రాథమిక పాఠశాలలు, 396 ప్రాథమికోన్నత పాఠశాలలు, 390 ఉన్నత పాఠశాలలకు సంబంధించిన కమిటీల ఎన్నికలకు ఈ నెల 26న ఎన్నికలు జరుగనున్నాయి. ఈ కమిటీలన్నీ కూడా తెలుగు తమ్ముళ్లతో నిండి పోనున్నాయని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

# యాంటీ ర్యాగింగ్ పోస్టర్ ఆవిష్కరణ



కళాశాలల్లో ర్యాగింగ్‌ను నిరోధించేలా తెలుగునాడు విద్యార్థి సంఘం రూపొందించిన 'యాంటీ ర్యాగింగ్ పోస్టర్'ను ఈ నెల 19వ తేదీన నెల్లూరులోని జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ జడ్.శివప్రసాద్ ఆవిష్కరించారు. ర్యాగింగ్ వల్ల జరిగే చెడును ఆయన ఈ సందర్భంగా వివరించారు. టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కాకర్ల తిరుమల నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ నాయకులు యస్‌దాని, పి.సాయి, హరీష్‌రెడ్డి, ప్రేమ్ కుమార్‌రెడ్డి, సాయితేజ, షారూఖ్ తదితరులు పాల్గొన్నారు.

# కాశ్మీర్ టు నెల్లూరు

అమర్‌నాథ్ యాత్రకు వెళ్లి, అక్కడ ఆందోళనల మధ్య చిక్కుకున్న 47 మంది జిల్లా యాత్రికులు ఈ నెల 15న జి.టి ఎక్స్‌ప్రెస్‌లో నెల్లూరుకు చేరుకున్నారు. బంధువులు వారికి నెల్లూరు రైల్వేస్టేషన్‌లో స్వాగతం పలికారు. బుచ్చి, కొడవలూరు మండలాలకు చెందిన 47మంది యాత్రికులు గత నెల 30న అమర్‌నాథ్ యాత్రకు బయల్దేరారు. వీళ్లు అక్కడకు చేరేసరికి ఉగ్రవాది బుర్హాన్‌వాని ఎన్‌కౌంటర్ మూలంగా కాశ్మీర్ లోయలో అల్లర్లు చెలరేగాయి. శ్రీనగర్ అంతటా కర్ఫ్యూ విధించారు. నెల్లూరుజిల్లా యాత్రికులు ఒకటిన్నర రోజు ఆర్మీక్యాంప్‌లో బస చేశారు. అల్లర్లు తగ్గుముఖం పట్టాక ఆర్మీ అండతో 8వ తేదీ అమర్‌నాథ్‌కు వెళ్లి మంచు శివలింగాన్ని దర్శించుకుని తిరుగు ప్రయాణమయ్యారు. అనంత్‌నాగ్ నుండి బాల్తార్ చేరాక మళ్ళీ అల్లర్లు చెలరేగడంతో మూడురోజుల పాటు ఆర్మీ క్యాంపులోనే ఉండిపోవాల్సి వచ్చింది. సైనికులే వారికి భోజనం ఏర్పాట్లు చేసి ఆదుకున్నారు. అల్లర్లు తగ్గాక యాత్రికులు అక్కడ నుండి బయలుదేరి 15వ తేదీ సొంత గూటికి చేరుకున్నారు. అమర్‌నాథ్ యాత్రలో అడుగడుగునా తమకు ఇండియన్ ఆర్మీనే కొండంత అండగా నిలిచిందని యాత్రికులు ప్రశంసించారు.



భరతముని ఆర్ట్స్ అకాడమి, మదనపల్లి వారు నిర్వహించే 'నెల నెల వెన్నెల' కార్యక్రమంలో 750వ మ్యాజిక్ ప్రదర్శన ఇచ్చిన సందర్భంగా ఇటీవల మెజీషియన్ శ్రీవత్స (నెల్లూరు ఉషా కృష్ణమూర్తి తమ్ముడు కుమారుడు)ను సత్కరిస్తున్న సినీ హాస్యనటులు ఎల్.బి.శ్రీరాం, ఎమ్మెల్సీ బండి నరేష్‌కుమార్‌రెడ్డి, అకాడమీ వ్యవస్థాపకులు మునిక్రిష్ణారెడ్డి తదితరులు

సింహపురి సమాచారం

# పాలిటెక్నిక్‌లో స్వచ్ఛభారత్

నెల్లూరులోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రాంగణాన్ని శుభ్రం చేసి మొక్కలు నాటారు. కళాశాల ప్రిన్సిపాల్ పాపయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవాలని, అందరూ స్వచ్ఛభారత్‌లో భాగస్వాములు కావాలని, మొక్కలు నాటి పర్యావరణాన్ని పచ్చదనాన్ని పరిరక్షించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆంగ్ల అధ్యాపకుడు జి.రాజ్‌కుమార్, ఇసిఇ హెడ్ రజని తదితరులు పాల్గొన్నారు.

## గురుకులాలకు
# దరఖాస్తు చేసుకోండి

జిల్లాలోని ఏపి గురుకుల పాఠశాలల్లో 6,7 తరగతుల్లో సీట్ల కోసం ఈ నెల 30వ తేదిలోగా దరఖాస్తు చేసుకోవాలని వెంకటగిరి గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ జి.నీలకంఠం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని గండిపాళెం, చిలమాన్‌చేను, వెంకటగిరి, తుమ్మలపెంట, ఆత్మకూరు, నెల్లూరు (మైనారిటీ) గురుకుల పాఠశాలల్లో సీట్ల కోసం ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ సమీపంలోని గురుకుల పాఠశాలల్లో సంబంధిత పత్రాలతో దరఖాస్తులను స్వయంగా అందజేయాలని ఆయన కోరారు. దరఖాస్తుదారులకు ఆగస్టు 10వ తేదిన వెంకటగిరిలోని ఏపి గురుకుల పాఠశాలలో ప్రవేశపరీక్ష వుంటుందని ఆయన పేర్కొన్నారు.

# ఇంటికో ఉద్యోగం.. ఎప్పుడిస్తారు?

## - బాబు హామీలపై ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి విమర్శ



రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పారని, అయితే ఆ హామీ ఇప్పటికీ నెరవేరనే లేదని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి విమర్శించారు. ఇంటికో ఉద్యోగం, ఉద్యోగం వచ్చిన దాకా నెలకి రెండువేలరూపాయలు నిరుద్యోగభృతి అందిస్తామని ఎన్నికలప్పుడు చెప్పిన చంద్రబాబునాయుడు, ఆ ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారని నిరుద్యోగులు నిరీక్షిస్తూనే వున్నారని ఆయన అన్నారు. బుధవారం నెల్లూరు రూరల్‌లోని పలు ప్రాంతాల్లో 'గడప గడపకి వైఎస్సార్ కాంగ్రెస్' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ, నిరుద్యోగుల ఆశల్ని అడియాశలు చేస్తూ, ఉన్న ఉద్యోగాలను కూడా తొలగిస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, లేదంటే తెలుగుదేశం పార్టీ ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజల పక్షాన పోరాటం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆనం విజయ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, ఎంపిటిసిలను, జడ్పీటిసిలను, ఎమ్మెల్యేలను పట్టించు కోకుండా జన్మభూమి కమిటీలకు పెత్తనమిచ్చి తెలుగుదేశం ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందన్నారు. ఎమ్మెల్యే గ్రాంట్‌ను ప్రభుత్వం తక్షణం విడుదల చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా ప్రాంతాల నాయకులు, వైఎస్సార్సీపి కార్యకర్తలు పాల్గొని గడప గడపకీ వైఎస్సార్సీపి కార్యక్రమం నిర్వహించారు.

# క్రికెట్ పోటీల విజేత..ఎల్‌ఎపి



గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో జరిగిన అంతర పాఠశాలల క్రికెట్ పోటీల్లో ఎల్ఎపి జట్టు విజేతగా నిలిచింది. రోటరీ క్లబ్, కనుమూరు హరిశ్చంద్రారెడ్డి, అల్లూరు ఆదిశేషారెడ్డి క్రికెట్‌క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన తుది పోటీల్లో ఎల్ఎపి జట్టు ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్న లిటిల్ ఏంజెల్స్ జట్టు నిర్ణీత 15 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 126 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నారాయణ జట్టు త్వర త్వరగా వికెట్లను కోల్పోయింది. 144 ఓవర్లలో 68 పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలైంది. ఈ పోటీల్లో మూడు, నాలుగు స్థానాలను చెన్నూరు, గూడూరు జడ్పీ ఉన్నత పాఠశాల జట్లు కైవశం చేసుకున్నాయి. అనంతరం విజేతలకు మునిసిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, ఎస్‌బిఐ చీఫ్ మేనేజర్ వై.మురళీకృష్ణ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గూడూరు క్రికెట్ క్లబ్ అధ్యక్షుడు కె. మునిగిరీష్, రోటరీ క్లబ్ కార్యదర్శి హరిప్రసాద్, జిల్లా క్రికెట్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి భానుప్రకాష్, నాగేశ్వరరావు, లవకుమార్, టిఆర్. మణివిజిత్, అనిత, రొటేరియన్లు మయూరి శ్యాంయాదవ్, పివి కృష్ణయ్య, మునిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదాల సమక్షంలో...
# దేశంలోకి వైసిపి కార్యకర్తలు



నెల్లూరు రూరల్ 30వ డివిజన్ తెలుగుదేశంపార్టీ ఇన్‌ఛార్జ్ ఆసిఫ్ బాషా ఆధ్వర్యంలో 50మంది వైసిపి కార్యకర్తలు రూరల్ టీడీపీ ఇన్‌ఛార్జ్ ఆదాల ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో ఈ నెల 17వ తేదీన తెలుగుదేశం పార్టీలో చేరారు. ఆదాల వారందరికీ పసుపు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించాడు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం జిల్లా ఉపాధ్యక్షులు ఆనం జయకుమార్‌రెడ్డి, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, హరిబాబుయాదవ్, సతీష్, సిరాజ్, ఆలి ముర్తాజా, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

## • నవ్యాంధ్రలో విద్యాపరిరక్షణ

# ఉద్యమం ఇక ఉధృతం




సేవ్ విద్య... షేర్ విద్య... లక్ష్యంగా, విద్యార్థినీ విద్యార్థులు, వారి తల్లిదండ్రుల యొక్క హక్కుల పరిరక్షణే ధ్యేయంగా నవ్యాంధ్ర విద్యా పరిరక్షణ సమితి భవిష్యత్ ప్రణాళికలతో ముందుకు పోతోందని నవ్యాంధ్ర విద్యా పరిరక్షణ సమితి అధ్యక్షులు తుంగా శివప్రభాత్‌రెడ్డి, కార్యదర్శి మాగుంట శరత్‌చంద్రారెడ్డిలు స్పష్టం చేశారు.

జులై 16వ తేదీ శనివారం నెల్లూరు అతిథిగ్రాండ్ హోటల్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. పరిరక్షణ సమితిని సొసైటి యాక్ట్ క్రింద 132/2016 నెంబరుగా రిజిష్టరు చేయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నూతన కమిటి మెంబర్లను పరిచయం చేశారు. ఉపాధ్యక్షులుగా షేక్ ఆరిఫ్ మాలిక్, జాయింట్‌సెక్రటరిగా ఉయ్యాల సుబ్రహ్మణ్యం, కోశాధికారిగా కలవకూరు నిఖిలారెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా షేక్ సాయిబాబు, మేమిగడ్డ వెంకటసుబ్బన్నలు నియమితులైనట్లు తెలిపారు. నెల్లూరుజిల్లాలోని జూనియర్ కళాశాలలకు సంబంధించిన పూర్తి సమాచారం అందజేయాలని గుంటూరు ఇంటర్మీడియట్ బోర్డు రీజినల్ జాయింట్ డైరెక్టర్‌ను సమాచార హక్కు చట్టం క్రింద కోరినట్లు తెలిపారు. ప్రైవేటు కళాశాలకు సంబంధించిన అనుమతులు, వాటి వివరాలు, ఒక్కొక్క కళాశాలకు అనుమతించిన బ్రాంచీల సంఖ్య, వాటి వివరాలను తెలియజేయాల్సిందిగా కోరినట్లు తెలిపారు. సొసైటీల క్రింద కళాశాలలకు అనుమతులు పొంది అకాడమీలను స్థాపించి వాటి ద్వారా అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, అసలు ఈ అకాడమీలకు ప్రభుత్వ అనుమతి ఉందా అని ప్రశ్నించారు. కళాశాలలు నిర్వహించే బ్రాంచీల భవనాల వివరాలు, ఆ భవనాలు స్వంతమా లేక అద్దెవా, వాటికి కమర్షియల్ అనుమతులు ఉన్నాయా, వుంటే వాటి నకలు, అద్దెవైతే లీజు అగ్రిమెంట్లు, అద్దె వివరాలతో పాటు పేరంట్స్ కమిటీ వివరాలు, కమిటీ సమావేశాల మినిట్స్ కాపీలను అందించాలంటూ రీజినల్ జాయింట్ డైరెక్టర్‌కు కోరినట్లు తెలిపారు. వెనుకబడిన తరగతుల విద్యార్థినీ విద్యార్థులకు ఈ కళాశాలల్లో కల్పిస్తున్న ఉచిత విద్యాసౌకర్యాలు, వాటి వివరాలు, కళాశాలల్లో వసూలు చేస్తున్న ఫీజుల వివరాలను కోరినట్లు తెలిపారు. గత మూడు సంవత్సరాల లాభనష్టాల వివరాలను ఈ కళాశాలల్లో పనిచేస్తున్న సిబ్బంది, వారి అర్హత వివరాలను కోరినట్లు తెలియజేశారు.

అలాగే, కేశవరెడ్డి విద్యాసంస్థల నిర్వహణా బాధ్యతను ఎవరు పోషిస్తున్నారు? అకడమిక్ మరియు అడ్మినిస్ట్రేషన్ బాధ్యతలు ఒకే యాజమాన్యం క్రింద నిర్వహింపబడుతున్నాయా, లేక వేరువేరుగా నిర్వహింపబడుతున్నాయా? అనే వివరాలను కోరుతూ బోర్డ్ ఆఫ్ పాఠశాల రీజనల్ జాయింట్ డైరెక్టర్‌కు లేఖ రాసామని, ప్రభుత్వం ప్రైవేట్ యాజమాన్యాలకు కేశవరెడ్డి విద్యాసంస్థలను అప్పజెప్పి తనను తానే తక్కువ చేసుకుంటుందని అన్నారు.

నవ్యాంధ్రలోని 13జిల్లాల్లో విద్యా పరిరక్షణ సమితిలను ఏర్పాటు చేస్తున్నామని, విద్య పేరుతో ప్రజలను మోసం చేస్తున్న విద్యాసంస్థల యాజమాన్యాల గుట్టు రట్టు చేస్తామన్నారు. తాము ప్రజలకు ఇబ్బంది కలిగించే ఎలాంటి ఆందోళనలు, రాస్తారోకోలు చేయకుండా చట్టపరంగా ప్రజలకు న్యాయం జరిగే దిశగా ముందుకు సాగుతామన్నారు. విద్యా పరిరక్షణ సమితిలో సభ్యులుగా ఎవరైనా చేరవచ్చని, దీన్ని బలోపేతం చేసేందుకు అందరూ కంకణం కట్టుకోవాలన్నారు.

## సాయి మందిరాలకు గురుపూర్ణిమ శోభ



నెల్లూరులోని షిరిడీ సాయిబాబా మందిరాలు గురుపూర్ణిమ శోభతో కళకళలాడాయి. శ్రీ సాయినాధునికి ప్రత్యేక పూజలు, విశిష్ట అలంకారాలతో, విద్యుద్దీప కాంతులతో ఆలయాలు అలరారాయి. 'ఓం సాయి శ్రీ సాయి జయ జయ సాయి' అంటూ భక్తులు పెద్దపెట్టున చేస్తున్న శ్రీ సాయినామస్మరణలతో సాయిబాబా ఆలయాలు హోరెత్తిపోయాయి. సాయిమందిరాలతో పాటు, అనేక వైష్ణవ ఆలయాల్లోనూ గురుపూర్ణిమ వేడుకలు ఘనంగా జరిగాయి. పలు ఆలయాల్లో స్వామివారి తీర్థప్రసాద వితరణ, అన్నప్రసాద వితరణలు జరిగాయి. ట్రంకు రోడ్డులోని శ్రీ షిరిడి సాయిబాబా ఆలయం, పద్మావతినగర్‌లోని సాయిదర్బార్ అద్దాల మండపం, మద్రాసు బస్టాండ్ వద్ద వున్న సాయిబాబా మందిరం, చిల్డ్రన్స్ పార్క్, భక్తవత్సలనగర్, రవీంద్రనగర్, దర్గా మిట్టలోని నిప్పోసెంటర్, వేదాయపాళెం తదితర ప్రాంతాలన్నిటా వున్న సాయినాధుని ఆలయాల్లో గురుపూర్ణిమ వేదు కలు వైభవంగా జరిగాయి. నగరంలోని ట్రంకురోడ్డు వద్ద వున్న శ్రీ షిర్డి సాయి బాబా మందిరంలో ఈ నెల 27వ తేది వరకు ఈ వేడుకలు నిర్వహిస్తారు.

## అలరించిన లక్ష్మీమణి నృత్యం



శ్రీ నారాయణతీర్థుల వారి 341వ జయంతి సందర్భంగా కృష్ణ లీలా తరంగ ప్రచార సమితి నిర్వాహకురాలు రాళ్ళపల్లి సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేది సాయంత్రం నెల్లూరు టౌన్‌హాలులో కృష్ణలీలా తరంగ నృత్యమాలిక కార్యక్రమం భక్తిరస స్ఫోరకంగా వుండి అందరినీ బాగా ఆకట్టుకుంది. విజేత ఆర్ట్స్ కార్యదర్శి వై.శేషగిరీశం ప్రార్థనాగీతంతో ప్రారంభమైన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సర్వేపల్లి మ్యూజిక్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్, భిక్షాటనాపూర్వక శ్రీ త్యాగరాజ స్మరణోత్సవ సభ కార్యదర్శి యనమండ్ర నాగదేవిప్రసాద్, విశ్రాంత తహశీల్దార్ రాళ్ళపల్లి రామసుబ్బారావు, ప్రపంచ తెలుగు సమాఖ్య ప్రాంతీయ కార్యదర్శి నలుబోలు బలరామయ్యనాయుడు తదితరులు జ్యోతిప్రకాశనం చేశారు. ఈ సందర్భంగా చెన్నైకి చెందిన నృత్య కళాకారిణి లక్ష్మీమణిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి వాయిద్య సహకారం అందించిన నవీన్, రామశంకర్, సిక్కిల్ బాలసుబ్రహ్మణ్యంలను సన్మానించారు. అనంతరం ప్రముఖ నృత్య కళాకారిణి, కొరియోగ్రాఫర్‌గా అంతర్జాతీయ ఖ్యాతి పొందిన లక్ష్మీమణి కృష్ణలీలా తరంగాలకు ఆకట్టుకునే నృత్యప్రదర్శనలు చేసి అందరి ప్రశంసలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో గురుకృప కళాక్షేత్రం అధినేత్రి సురభి గాయత్రి, ప్రముఖ రంగస్థల నటుడు వల్లకవి వెంకటసుబ్బారావు, జి.సుభద్రాదేవి తదితరులు పాల్గొన్నారు.

## కొత్త అందాలతో పునః ప్రారంభమైన

# మురళీకృష్ణ

# శాఖాహార ప్రాంగణం



రుచికి, శుచికి, శుభ్రతకి, నాణ్యతకి నమ్మకంగా నెల్లూరీయుల అభిరుచులకు చిరునామాగా గత 46సంవత్సరాలుగా ఆదరింపబడుతున్న మురళీకృష్ణ హోటల్స్ యాజమాన్యం మద్రాసు బస్టాండు ప్రాంతంలోని ప్రకాశం పంతులు కాంప్లెక్స్‌లోగల వెజిటేరియన్ హోటల్‌ని కొద్దికాలం మూసివేసి ఆధునిక హంగులతో జులై 21వ తేదీ(నిన్న) గురువారం ఉదయం పునఃప్రారంభించారు. ఆధునిక వసతులతో పాటు కొంత భాగాన్ని ఎయిర్‌కండిషన్ చేశారు. పూర్తి స్థాయిలో శాఖాహార ఫలహార భోజనాలను సరఫరా చేసే ఈ హోటల్‌ను సంస్థ వ్యవస్థాపకులు గ్రోసు గోపాలయ్య ప్రారంభించారు. మురళీకృష్ణ కుటుంబం గోపాలయ్య, హజరత్‌బాబు, సుబ్బారావు, మురళి, చైతన్యకృష్ణ, మురళీకృష్ణల సారధ్యంలో ఈ వేడుక ఘనంగా జరిగింది. వందలాది మంది గోపాలయ్య ఆప్తులు, మురళీకృష్ణ అభిమానులు ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు.

గోపాలయ్యే స్వయంగా రిబ్బన్ కత్తిరించి హోటల్‌ని పునఃప్రారంభించిన ఈ వేడుకలో నగర మేయర్ అబ్దుల్ అజీజ్, మాజీ శాసనసభ్యులు ఆనం వివేకానందరెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, ఓయస్‌డి పెంచలరెడ్డి, కార్పొరేటర్ ఆనం రంగమయూర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ పుట్టా రామకృష్ణారెడ్డి, యం.జి.బ్రదర్స్ అధినేత గంగాధరం, నగర పాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వర్లు, 'లాయర్' వారపత్రిక సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి, పట్టణంలోని వివిధ హోటల్స్ అధినేతలు, వైద్యులు, వివిధ రంగాల ప్రముఖులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

వచ్చిన ప్రతి అతిథిని మురళీకృష్ణ కుటుంబం ఆప్యాయంగా పలుకరించి స్వాగతం పలికారు. నాలుగున్నర దశాబ్దాలుగా నెల్లూరీయుల మనసుల్లో పదిలమైన స్థానాన్ని సంపాదించుకున్న మురళీకృష్ణ కుటుంబానికి "లాయర్" అభినందనలు.









## ‘ప్రభా’తం

# ప్రజాస్వామ్య విజయమిది!

**టర్కీలో.. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని కుట్రతో కూలదోసి ఏకాఏకిన అధికారం చేపట్టాలనుకుంటున్న తిరుగుబాటుదారులపై ప్రజలు అగ్రహోదగ్రులయ్యారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకునేందుకు ప్రజలే వీధుల్లోకి వచ్చి యుద్ధట్యాంకులకు ఎదురొడ్డి నిలవడంతో తిరుగుబాటుదారులు తోకముడిచారు. ప్రజల అండతో ప్రభుత్వసైన్యం తిరుగుబాటుసైన్యాన్ని అణచి వేసింది. ప్రజాస్వామ్యాన్ని రక్షించుకునేందుకు ప్రజలెంతగా ఆరాటపడతారో..ఈ ఉదంతంలో టర్కీ ప్రజలే ఒక ఉదాహరణ.**

ఇక్కడ ప్రజలే ప్రభంజనమై ఉవ్వెత్తున లేచారు. ప్రభుత్వంపై తిరుగుబాటు చేస్తున్నవారిని ప్రజలే జనసైన్యంగా మారి అడ్డుకున్నారు. యుద్ధట్యాంకులను పేలుస్తూ, తుపాకులు కాలుస్తూ వచ్చిన తిరుగుబాటుదార్లను అడ్డుకుని ప్రజలు ఆ తిరుగుబాటును చిత్తు చేశారు. కుట్రదారులుగా మారిన తిరుగుబాటుసైన్యంపై ఎదురొడ్డి పోరాడి..ప్రజాసైన్యందే విజయమని నిరూపించుకున్నారు. తమకు అత్యంత ప్రీతిపాత్రమైన ప్రజాస్వామ్య బావుటాను విజయవంతంగా ఎగురవేశారు. జనం దెబ్బకు తిరుగుబాటుదార్లు తోకముడిచారు...ఇదేదో సినిమా కథ కాదు. టర్కీలో వారం క్రితం జరిగిన సంగతి.

రాత్రివేళ, అందరూ ఆదమరచి నిద్రిస్తున్న వేళ.. ఆ దేశాధ్యక్షుడు తీరప్రాంతంలో విశ్రాంతి తీసుకుంటున్న సమయాన.. ఒక్కసారిగా దేశంలోని ముఖ్యనగరాల్లో యుద్ధ ట్యాంకులు పేలుళ్ళతో విధ్వంసాలు సృష్టించాయి. సాక్షాత్తూ అక్కడి సైన్యమే తుపాకులు చేతపట్టి ప్రభుత్వాన్ని కూల్చివేసేందుకు విఫలయత్నం చేసింది. అయితే, ఎట్టకేలకు జనం ప్రభంజనంలా విరుచుకుపడి ఆ తిరుగుబాటును ఎదుర్కొని, ప్రభుత్వానికి బాసటగా నిలవడంతో ఇరవైనాలుగు గంటలు కూడా గడవకముందే తిరుగుబాటుదారులు ప్రభుత్వానికి లొంగిపోయారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకునేందుకు ప్రజలు ఎంతగా ఆరాటపడతారో.. యుద్ధట్యాంకులకైనా వెరవక గుండె దమ్ముతో జనం ఎలా వీధుల్లోకి వచ్చి పోరాడతారో.. మొన్నటి టర్కీ తిరుగుబాటే ఒక తాజా ఉదాహరణ.

గత శుక్రవారం రాత్రి టర్కీలో జరిగిన నాటకీయ పరిణామాలు టర్కీనే కాక, ప్రపంచాన్నే దిగ్భ్రాంతికి గురిచేశాయి. టర్కీ అధ్యక్షుడు విశ్రాంతి తీసుకునేందుకు అక్కడి సముద్రతీరంలోని మర్మరిస్‌కు వెళ్ళిన సమయంలో సైన్యంలోని ఓ వర్గం తిరుగుబాటు చేసింది. దాదాపు 13 ఏళ్ళ ఎర్డోగన్ పాలనను సవాల్ చేస్తూ యుద్ధ ట్యాంకులతో వీధుల్లోకి వచ్చారు. విమానాశ్రయాలను, వంతెనలను మూసివేశారు. జనం బయటికి రావద్దంటూ హెచ్చరికలు చేశారు. టర్కీ అధికార టివి వున్న ప్రాంగణాన్ని స్వాధీనం చేసుకుని దేశవ్యాప్తంగా కర్ఫ్యూ, మార్షల్ లా విధిస్తున్నట్లు ప్రకటించారు. టర్కీ ప్రభుత్వం ప్రజాస్వామిక, లౌకిక న్యాయపాలనను తుంగలో తొక్కిందంటూ టివిలో చెప్పించి, దేశాన్ని శాంతిమండలి ఆధ్వర్యంలో పరిపాలించనున్నట్లు ప్రకటించారు కూడా. అంతే..ఆ తర్వాత టివి ప్రసారాలు నిలచిపోయాయి. ఈ తిరుగుబాటు సమాచారాన్ని తెలుసుకున్న టర్కీ అధ్యక్షుడు ఎర్డోగన్ వెనువెంటనే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఓ ప్రైవేట్ టివి ఛానల్ ద్వారా ప్రజలకు చేరువయ్యారు. సైనిక తిరుగు బాటును వ్యతిరేకిస్తూ ప్రజలంతా వీధుల్లోకి రావాలని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. అధ్యక్షుని పిలుపులు, సందేశాలు ఈ దశలో ప్రజలను బాగా ప్రభావితం చేశాయి. సైనిక కుట్రకు వ్యతిరేకంగా ప్రజలంతా వీధుల్లోకి రావాలంటూ అధ్యక్షుడు ఎర్డోగన్ పిలుపుతో భారీఎత్తున ప్రజలు స్పందించి వీధుల్లోకి వచ్చారు. దీంతో తిరుగుబాటుదారులు ఆగ్రహించి, జనంపై కాల్పులు జరిపారు. యుద్ధట్యాంక్‌లతో భయపెట్టారు. పార్లమెంట్ భవనాన్ని ట్యాంకులతో ధ్వంసం చేశారు. దీంతో అంకారా, ఇస్తాంబుల్ నగరాలు తుపాకీ మోతలు, భారీపేలుళ్ళతో దద్దరిల్లిపోయాయి. అయినా జనసైన్యం ఏమాత్రం బెదరకుండా తిరుగుబాటుదారులకు ఎదురొడ్డి నిలిచింది. కుట్రదారులకు వ్యతిరేకంగా సైన్యం తిరుగుబాటును ప్రభుత్వ సైన్యం అణచివేసింది. గంటల్లోనే కుట్రదారులెందరినో అదుపులోకి తీసుకుంది. అంతే, ఇరవై నాలుగు గంటలు కూడా గడవక ముందే ప్రజాసైన్యం సాయంతో తిరుగుబాటు సేనల్ని ప్రభుత్వసైన్యం అదుపులోకి తీసుకుంది. ఈ ఘటనల్లో దాదాపు 265 మంది దాకా ప్రాణాలు కోల్పోయివుంటారని అంచనా. ప్రస్తుతం పరిస్థితి పూర్తిస్థాయిలో అదుపులోవుంది. ఈ ఆందోళనల్లో మొత్తం 161 మంది మరణించారని, మరో 104 మంది తిరుగుబాటులు మృతిచెందారని, వందలాదిమంది గాయపడ్డారని ఆ దేశప్రధాని బినాలి యిల్దిరిమ్ పేర్కొన్నారు. అయితే, టర్కీకి ఇలాంటి తిరుగుబాట్లు కొత్తేమీ కాదు. కానీ, తిరుగుబాటుకు వ్యతిరేకంగా ప్రజలే వీధుల్లోకి వచ్చి జనమే ఒక జనప్రభంజనంగా మారడం ఇదే తొలిసారి. గత కొన్నేళ్ళుగా ప్రభుత్వం చేపట్టిన చర్యలు సైన్యంలో కొందరికి తీవ్ర అసంతృప్తి కలిగించినందువల్ల తిరుగుబాటుకు తెగించివుంటారని భావిస్తున్నారు. అయితే, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని కూలదోసి ఏకాఏకిన అధికారం చేపట్టాలనుకుంటున్న తిరుగుబాటుదారులపై ప్రజలు అగ్రహోదగ్రులయ్యారు. . ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రజలే నడుం బిగించిన బృహత్తర సన్నివేశమిది. అందుకు తగ్గట్టుగా ఆ దేశాధ్యక్షుడు ప్రజలను ఎప్పటికప్పుడు సాంకేతిక పరిజ్ఞానంతో అప్రమత్తం చేయడంతో, తిరుగుబాటు దారుల ప్రయత్నాలు వెంటనే విఫలమయ్యాయి. అయినప్పటికీ ఇది..సాక్షాత్తూ ప్రజా విజయమే..ప్రజాస్వామ్య విజయమేనని నిస్సందేహంగా అనవచ్చు. ప్రజల అండదండలతో ప్రభుత్వసైన్యం ఈ తిరుగుబాటును విజయవంతంగా తిప్పికొట్టడం ముమ్మాటికీ ఒక చరిత్రాత్మక ఘటనే అనవచ్చు. టర్కీలో ప్రజాస్వామ్యయుత ప్రభుత్వానికి అమెరికా, రష్యా, భారత్, చైనాతో సహా ప్రపంచం లోని అనేక దేశాలు బాసటగా నిలిచాయి. రక్తపాతానికి తావివ్వకుండా టర్కీలో సాధారణ పరిస్థితి నెలకొనేందుకు కృషిచేయాలని, ప్రజాస్వామ్యానికి మద్దతునిస్తూ ప్రజాతీర్పును గౌరవించాలని టర్కీలోని అన్ని పక్షాలకూ భారత్ విజ్ఞప్తి చేసింది. ఏదేమైనా, టర్కీలో ఇప్పుడు కావాల్సింది శాంతి యుత వాతావరణం. ఈ తిరుగుబాటును ఒక గుణపాఠంగా తీసుకోవాలి. ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా ఎలాంటి విధానాలు చేపట్టకుండా పాలన పారదర్శకంగా సాగాలి. రక్తపాత రహితంగా, శాంతి యుతంగా..ప్రజాస్వామ్యయుతంగా దేశపాలనకు ఉపక్రమించాలి.. సుస్థిరమైన.. విశుద్ధమైన.. శాంతి యుతమైన.. ప్రజాస్వామ్య పాలన ఒక్కటే శాంతికి.. ప్రగతికి మార్గమన్నది అందరికీ తెలిసిందే. అందుకు ప్రభుత్వం, ప్రజలు అందరూ కలసి సమిష్టిగా కృషి చేయాలి. టర్కీలో ప్రజాస్వామ్యం పటిష్టం కావాలి.

## వాణిజ్య కోర్టులు ఏర్పాటు

### - హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కోదండరామ్

పారిశ్రామికాభివృద్ధికి అనుగుణంగా ఏర్పడుతున్న వివాదాల పరిష్కారానికి త్వరలో వాణిజ్య కోర్టులు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఉమ్మడి రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, నెల్లూరుజిల్లా పోర్ట్‌పోలియో జడ్జి జస్టిస్ చల్లా కోదండరామ్ పేర్కొన్నారు. నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బార్ అధ్యక్షుడు ఎం.రామచంద్రారెడ్డి అధ్యక్షతన ఇటీవల ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ జిల్లాలో శ్రీసిటి, కృష్ణపట్నం పోర్టు ఏర్పాటుతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా శరవేగంగా పారిశ్రామికీకరణ అభివృద్ధి జరుగుతున్న నేపథ్యంలో న్యాయవాదులు ఈ దిశగా వృత్తిలో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కేసుల సంఖ్య పెరిగిపోతున్నాయని, జాప్యాన్ని నివారిస్తూ న్యాయమూర్తులు, న్యాయవాదులు పరస్పర సహకారంతో కేసుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి మౌలానా జునైద్ అహ్మద్ మాట్లాడుతూ న్యాయవాదులు, తనతోటి సహచరులందరూ సహకరించాలని కోరారు.

ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం.రామచంద్రారెడ్డి, జి.బాలసుబ్రహ్మణ్యం, కమిటి సభ్యులు, సీనియర్ న్యాయవాదులు, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కోదండరామ్‌ను సన్మానించి జ్ఞాపికను అందజేశారు.

## జిల్లాలో 50లక్షల మొక్కలు



మొక్కను నాటుతున్న జిల్లా కలెక్టర్ యం.జానకి

నెల్లూరుజిల్లాలో 50లక్షల మొక్కల పెంపకాన్ని లక్ష్యంగా పెట్టుకున్నట్లు జిల్లా కలెక్టర్ యం.జానకి పేర్కొన్నారు. ఈ నెల 16వ తేదీ నెల్లూరు తహశీల్దార్ కార్యాలయం ఆవరణంలోని ఏపి వ్యవసాయ పరిశ్రమల అభివృద్ధి సంస్థ(ఆగ్రోస్), అగ్నిమాపక శాఖ కార్యాలయాల్లో కలెక్టర్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 28న వన మహోత్సవం సందర్భంగా 10లక్షల మొక్కలను నాటేందుకు ప్రణాళికలు రూపొందించడం జరిగిందన్నారు. నెల్లూరు ఆర్డీఓ వెంకటేశ్వర్లు, సిపిఓ పిబికె మూర్తి, ఆగ్రోస్ రీజినల్ మేనేజర్ ప్రసాదరావు, మార్క్‌ఫెడ్ మేనేజర్ రమాదేవి, నెడ్‌క్యాప్ మేనేజర్ శ్రీనివాసులురెడ్డి, జీవనియంత్రణ ప్రయోగశాల ఏడిఏ సుమలత, ఫైర్ ఆఫీసర్ జ్ఞాన సుందరం పాల్గొన్నారు.

## విఘ్నేశ్వరునికి .. శత కలశాభిషేకం

ఆషాఢ మాసం సందర్భంగా నెల్లూరులోని మద్రాసు బస్టాండ్ వద్ద వున్న శ్రీ వరసిద్ధి విఘ్నేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 17న స్వామివారికి శత కలశాభిషేకం, లక్ష గరికార్చన పూజలు ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రముఖ వేదపండితులు మాచవోలు రాజశేఖరశాస్త్రి, మాచవోలు కోటేశ్వరశర్మ, బ్రాహ్మణ యువజనసంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలను నిర్వహించారు. తొలుత గణపతి పూజ, పుణ్యాహవచనం, కలశస్థాపన తదితర కార్యక్రమాలు నిర్వహించి, అనంతరం లక్ష దుర్వార్చన(గరిక పూజ), మహా కలశాభిషేకం కార్యక్రమాలను ఎంతో వేడుకగా చేపట్టారు. ఆ తర్వాత సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి కళ్యాణోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. తదుపరి స్వామివారికి పుష్పయాగం నిర్వహించారు. గుండాల గురవయ్య బృందంవారి కోలాటం ప్రదర్శన, భారతి సంగీత విద్యాలయం అధినేత్రి ఏ.రమాదేవి శిష్యబృందంచే అన్నమయ్య సంకీర్తనల ఆలాపన ఈ సందర్భంగా అందరినీ ఆకట్టుకున్నాయి. హిందూ ధర్మపరిరక్షణ ట్రస్ట్ జిల్లా విభాగం, సాయి సత్సంగ్ నిలయం (గూడూరు) వారి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో కోట సునీల్‌స్వామి, ఊటుకూరు బ్రహ్మారెడ్డి, భీమవరపు శ్రీకాంత్ నాయుడు, కొత్తపల్లి సాయికుమార్, వేనాటి చంద్రశేఖరరెడ్డి, ఊటుకూరు శ్రీనివాసులురెడ్డి, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ కట్టడాలు సరే... ఆక్రమణల సంగతేంటి?

మనం ఒకరికి మంచిని బోధించే ముందు ఆ మంచిని మనం ఆచరిస్తున్నామా లేదా అన్నది చూసుకోవాలి. నెల్లూరు నగరంలో అక్రమ కట్టడాలను కూల్చేయాలని మున్సిపల్ మంత్రి నారాయణ ఆదేశించడం బాగానేవుంది. అయితే జూలై 15వ తేదీ సంచికలో ‘లాయర్’ పత్రికలో ‘నారాయణ కాలేజీలు అక్రమమా? సక్రమమా?’ అని వ్రాసిన ఆర్టికల్‌ను పరిశీలించాలి. నాకు తెలిసినంత వరకైతే నారాయణ కాలేజీ భవనాలలో కొన్ని తప్పితే మిగతా భవనాలన్నీ కూడా నిబంధనలకు విరుద్ధంగా ఉన్నవే! అపార్ట్‌మెంట్లు, కమర్షియల్ కాంప్లెక్స్‌లలో నారాయణ కాలేజీలు నడుపుతున్నారు. ముందు నారాయణ తాను సక్రమంగా ఉండడం అలవర్చుకోవాలి. అక్రమ కట్టడాలను కూల్చడం కంటే ముందు, మున్సిపల్, ఇరిగేషన్ స్థలాలను కబ్జాచేసి భారీ భవంతులను నిర్మించి వున్నారు. వాటిని కూల్చడానికి చొరవచూపాలి.

**- బి.రాజశ్రీ, నెల్లూరు.**

## గోదావరి నీళ్లలో పుష్కరస్నానం

ముఖ్యమంత్రి చంద్రబాబు అత్యుత్సాహం మూలంగా ఆచారాలు సైతం మారిపోతున్నాయి. ఏ నది అయినా అది స్వచ్ఛంధంగా పారేటప్పుడు అందులో మునిగితే అది ఆ నదికి చెందిన పుష్కర స్నానమవుతుంది. కాని చంద్రబాబు పుణ్యాన ఈసారి గోదావరి నీళ్లలో కృష్ణా పుష్కర స్నానం చేసే పరిస్థితి వచ్చింది. పట్టిసీమ ద్వారా వదిలిన నీళ్లు కృష్ణానదిలో కలిసాయి. గత ఏడాదే గోదావరిలో పుష్కరస్నానాలు చేసారు. మళ్లీ ఇప్పుడూ గోదావరి నీళ్లలోనే స్నానాలా?

**కంటే మధుసూదన్, గుంటూరు.**

## మార్పు రావాలి




ప్రజల్లో మత ఛాందసవాదులు పోవాలి. ఇది ఆధునిక సమాజం. భక్తిని, మతాన్ని మనలో మంచిని పెంచుకునేందుకే వాడుకోవాలి. మూర్ఖత్వాన్ని విడనాడాలి. ముఖ్యంగా మతవాదం పేరుతో ప్రపంచ వ్యాప్తంగా ఉగ్రదాడులు జరుగుతున్నాయి. మనిషి సాటి మనిషిని ఆదుకోవాలేగాని, సాటి మనిషి ప్రాణం తీసే కిరాతకానికి పాల్పడకూడదు.

**సి.రాంప్రసాద్‌నాయుడు, నెల్లూరు.**

## మళ్లీ వరదలొస్తేగాని...

# కళ్లు తెరవరా?



**నెల్లూరు నగరంలో మంత్రి నారాయణ ఆదేశాలతో జరుగుతున్న అక్రమ కట్టడాల విధ్వంసం పెద్ద టాపిక్ అయ్యింది. దీనిమీద ప్రశంసల కంటే విమర్శలు ఎక్కువగా ఉన్నాయి. అందరి నోటా ఒక్కటే ప్రశ్న? కట్టుకున్నాక కూల్చేయడానికి, కట్టేటప్పుడేమన్నా కళ్లు మూసుకున్నారా? అని.**

నిబంధనలకు విరుద్ధంగా కట్టిన భవనాలను ఇప్పటికిప్పుడు కూల్చేయకుంటే కొంపలంటుకుపోయేదేమీ లేదు. దబ్బుల కోసం అక్రమ కట్టడాలను క్రమబద్దీకరించుకునే అవకాశం కల్పించింది ప్రభుత్వమే! అలాంటి అవకాశం ఉందన్న ధీమాతోనే నిర్మాణదారులు నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. తప్పు చేయొచ్చని చెప్పిన ప్రభుత్వమే మళ్లీ దానిని తప్పంటే ఎలా? ఇప్పుడు నగరంలో అర్జంట్‌గా చేయాల్సింది కట్టిన భవనాలను కూలగొట్టడం కాదు. ఆక్రమణలను తొలగించడం. పంటకాలువ పూడిక తీయడం.

గతేడాది నవంబర్‌లో వచ్చిన వరదల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మున్సిపల్ మంత్రి పి.నారాయణలు ఇచ్చిన హామీలను నెల్లూరు ప్రజలు ఇప్పుడు గుర్తు చేసుకుంటున్నారు. నవంబర్‌లో కురిసిన భారీ వర్షాల ధాటికి నెల్లూరులోని పలు ప్రాంతాలు ముంపుకు గురికావడం తెలిసిందే! మన్సూర్‌నగర్, మనుమసిద్ధి కాలనీ వంటి ప్రాంతాలైతే అయిదారు రోజులు నీళ్లలోనే వుండిపోగా, పడవల్లో వెళ్లి ప్రజలకు అన్నం పొట్లాలు, మంచినీళ్ల ప్యాకెట్లు ఇచ్చారు. మూడురోజుల పాటు నెల్లూరులోనే మకాం వేసిన చంద్రబాబు ఈ పరిస్థితులను కళ్లారా చూశారు. నగరం ఇంతగా ముంపుకు గురి కావడానికి ప్రధాన కారణం నగరంలోని పంటకాలువల ఆక్రమణలు, అవి పూడిపోవడమేనని గుర్తించారు. 200 ప్రొక్లెయిన్‌లను 200 మంది సర్వేయర్‌లను పెట్టి ఆక్రమణలను గుర్తించి తొలగిస్తామని ఆరోజు మంత్రి ఘనంగా ప్రకటించారు. ఈమేరకు నగరంలో పంటకాలువల ఆక్రమణలపై మార్కింగ్ కూడా వేయించారు. ఆక్రమణల తొలగింపులో ఇళ్లు కోల్పోయే బాధితులకు ఎన్టీఆర్ ఇళ్లు కూడా కేటాయిస్తామని చెప్పారు.

మొదట చేయాల్సిన పని ఇదే! ఇళ్లను పూర్తి స్థాయిలో తొలగించక పోయినా, ముందు కాలువల పూడిక తీయాలి. కాలువలను పూర్తిగా ఆక్రమించేసి కట్టిన కట్టడాలను తొలగించాలి. కాలువలు డ్రైనేజీలతో నిండిపోవడం వల్లే మొన్న వరద నీరంతా జన నివాసాలను చుట్టుముట్టింది. కాలువలలో పూడిక తీయకపోతే రేపు వర్షాలొచ్చినా మళ్లీ అదే ముంపు తప్పదు.

మళ్లీ వర్షాల సీజన్ వస్తోంది. ఈ లోపు పాలకులు మేల్కొనాలి. పంట కాలువల పూడిక తీత, ఆక్రమణల తొలగింపుపై దృష్టి పెట్టాలి. ప్రజలకు, నగరానికి నష్టం కలిగించే వీటిపై చొరవ తీసుకోవాలి. ఆ తర్వాత అక్రమ కట్టడాలను తీరిగ్గా తొలగించవచ్చు.

## నారాయణ బిల్డింగ్‌లు...

# ఎంత వరకు కరెక్ట్?

**- ఎమ్మెల్యే అనిల్**



నెల్లూరులో మున్సిపల్ మంత్రి నారాయణ నడుపుతున్న ఆసుపత్రులు, కాలేజీల భవనాలు ఎంతవరకు కరెక్ట్‌గా ఉన్నాయో చూడాలని నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. నగరంలోని పలు డివిజన్‌లలో 'గడప గడపకు వైయస్సార్ కాంగ్రెస్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఆయన ఆ పనిలో నారాయణ మీద విరుచుకుపడ్డాడు. ముందుగా నారాయణ భవనాలన్నింటిని పరిశీలించాలి. వాటిలో ఎలాంటి అక్రమాలు లేవని శ్వేతపత్రం ఇవ్వాలి. ఆ తర్వాత నగరంలో కట్టడాల వైపు చూడాలని ఆయన డిమాండ్ చేశాడు. మంత్రయ్యాక నారాయణ ఈ జిల్లాకు, ఈ నెల్లూరుకు చేసిందేమీ లేదు. కొత్త ఇళ్లు కట్టిద్దాం, ఉన్న ఇళ్లను నిలబెడదాం అన్న ఆలోచన లేకుండా నిద్రలేస్తే కొంపలు కూల్చే పని పెట్టుకుంటున్నాడు. ప్లాన్ అప్రూవల్‌కు విరుద్ధంగా లంచాలు మింగి భవనాలు కట్టేలా ప్రొత్సహించింది మీరే, తర్వాత వాటిని కూలగొడతామంటున్నది మీరే! ఇదేం పద్ధతి. ఇప్పటికైనా ప్లాన్ అప్రూవల్స్ ప్రకారమే భవనాల నిర్మాణం జరిగేలా ప్రజల్లో చైతన్యం తెండి. అంతేగాని భవనాలు కూల్చి వారి బ్రతుకులుతో ఆడుకోవద్దని అనిల్ హెచ్చరించాడు.

## ఉదయగిరి జమానాలో...

# విభజించు - పాలించు



**రాజకీయంగా చైతన్యవంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో కులరాజకీయాలెప్పుడూ స్థానముండేది కాదు. నాయకుడి యోగ్యతను బట్టి ప్రజలు పట్టంకట్టేవాళ్ళు. ఈ నియోజకవర్గంలో మొదటి నుండి రెడ్ల డామినేషన్ ఎక్కువ. ఆ తర్వాత కమ్మ సామాజిక వర్గం బలంగానే వుంది. అయితే ఇన్ని ఎన్నికల నుండి కూడా ఎప్పుడూ కులం ఫీలింగ్ కనిపించేది కాదు.**

ఈ ప్రజలు వెంకయ్యనాయుడిని రెండుసార్లు, కంభం విజయరామిరెడ్డిని రెండుసార్లు, మేకపాటి రాజమోహన్‌రెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిలను నాలుగుసార్లు గెలిపించారు. కమ్మ సామాజిక వర్గానికి చెందిన మాదాల జానకిరామ్, బొల్లినేని రామారావులను గెలిపించారు. అయితే ఎమ్మెల్యేలైన వీళ్లెవరూ తమ వద్ద కులం పోకడలు, ఆధిపత్యపు జాడ్యాన్ని కనిపించనీయలేదు. ఇప్పటి ఎమ్మెల్యే బొల్లినేని రామారావు వ్యక్తిగతంగా కులం ఫీలింగ్ కనిపించనీయడం లేదుగాని, ఆయన జమానాలో ఆ తేడా కనిపిస్తోంది. ఒక సామాజిక వర్గానికి అధిక ప్రాధాన్యత నిస్తూ, మిగిలిన సామాజిక వర్గాలను చిన్నచూపు చూస్తున్నారన్న విమర్శలున్నాయి. కులం పైత్యాన్ని నెత్తికెత్తుకున్న నాయకుడెవరూ కూడా రెండోసారి గెలిచిన దాఖలాలు లేవు. ఒక కులం ఓట్లతో ఏ లీడర్ గెలవడు. అన్ని కులాలను కలుపుకుపోతేనే అతను ప్రజా నాయకుడు అవుతాడు. బొల్లినేని రామారావు కాస్త జాగ్రత్తపడితే మంచిది.



## పెద్ద పదవులిస్తే సరి...

# లేదంటే అసంతృప్తే మరి...

**వరదల సమయంలో హెలికాప్టర్ నుండి ఆహార పొట్లాలు వదిలితే జనం ఎలా ఎగబడతారో, జిల్లాలోని తెలుగుదేశం నాయకులు కూడా పదవుల కోసం అలా ఎగబడుతున్నారు. కొందరు నాయకులు ఎలాంటి పదవిచ్చినా చాలనుకుంటుంటే, పదవులు వస్తాయని గ్యారంటీ వున్న నాయకులు మాత్రం చిన్నా చితకా పదవులు వస్తే తీసుకునేదే లేదంటున్నారు. చిన్నచిన్న దేవాలయాల కమిటీ సభ్యుల పదవుల కోసం కూడా తెలుగుదేశం నాయకులు తన్నుకు ఛస్తున్నారు. ఈ ప్రభుత్వంలో ఏదో ఒక నామినేటెడ్ పదవి రావడమే బ్రహ్మాండం అన్నట్లుగా వుంటే, మా స్థాయికి తగ్గ పదవులిస్తేనే తీసుకుంటాం, లేదంటే వాటి జోలికి కూడా పోమంటున్నారు జిల్లా తెలుగుదేశం నాయకులు.**

జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా కిలారి వెంకటస్వామినాయుడు పేరు ఖరారైందని సమాచారం. అయితే ఆయన ఈ పదవి పట్ల అసంతృప్తితో ఉన్నాడు. నెల్లూరు ఆర్టీసీ రీజియన్ ఛైర్మన్ పదవిపై ఆయన ఆశ. కాని ఆర్టీసీ విభజన కష్టాలను అధిగమించలేదు. కాబట్టి అది ఇవ్వలేం, ఇది తీసుకోమని కిలారికి నచ్చజెప్పారు. ఈ పదవిని ఆయన అయిష్టంగానే ఒప్పుకున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలిగా తాళ్ళపాక అనూరాధ పేరు ప్రచారంలో వుంది. అయితే ఆమె కూడా ఈ పదవి పట్ల విముఖతతో వున్నారు. మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ పదవన్నా అయితే ఒక స్థాయి ఉంటుంది కాని, సభ్యురాలిగా వుండి ఏం లాభమని ఆమె బాధ. ఇస్తేగిస్తే ప్రోటోకాల్ వుండే పదవి ఇవ్వండని ఆమె డిమాండ్. కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి అయితే నెల్లూరు మేయర్‌నే డమ్మీని చేసే 'నుడా' ఛైర్మన్ పదవి కోరుతున్నాడు. అయితే ఇది 'ఆలూ లేదు చూలూ లేదు అల్లుడిపేరు అల్లూరామలింగం' అన్నట్లుగా వుంది. ఎందుకంటే 'నుడా' ఏర్పడుతుందో లేదో కూడా తెలియదు. కాబట్టి రాష్ట్ర స్థాయి కార్పొరేషన్‌లలో ఏదో ఒక పదవి ఇస్తారని టాక్. ఆయన డిమాండ్ గట్టిగానే వుంది. అట్టాంటి ఇట్టాంటి అల్లాటప్పా పదవులిస్తే తీసుకునేది లేదని, ఖచ్చితంగా కారు మీద బులుగులైటు పెట్టుకునే స్థాయి వున్న పదవే కావాలని ఆయన డిమాండ్. రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ ఛైర్మెన్ పదవి విషయంలో ఆయన ఆశలన్నీ కూడా తన ఆరాధ్యదైవం, యువరత్న నందమూరి బాలయ్య మీదే పెట్టుకుని ఉన్నాడు. ఇక నామినేటెడ్ రేస్‌లో వున్న పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి, దేశాయిశెట్టి హనుమంతురావులను చిన్నాచితకా పదవులతో సరిపెట్టలేరు. వాళ్ల స్థాయికి తగ్గ పదవులు ఇవ్వక తప్పదు.



# నారాయణతో అమీతుమీ

- బయటపడ్డ ఆదాల
- దొరికిన కూల్చివేత అస్త్రం

మున్సిపల్ మంత్రి పి.నారాయణ వ్యవహారశైలిపై మాజీమంత్రి, నెల్లూరురూరల్ ఇన్‌ఛార్జ్ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఇటీవలకాలంలో బాగా కోపంతో వున్నాడు. మంత్రికి ఆదాలకు మధ్య ప్రత్యక్షయుద్ధాలు, వర్గపోరు, కుమ్ములాటలు, సీట్ల కొట్లాటలు ఏవీ లేవు. ఒకరకంగా చెప్పాలంటే 2014ఎన్నికల సమయంలోగాని, ఆ తర్వాతగాని ఇద్దరూ బాగానే వున్నారు. నారాయణ కూడా ఆదాలకు చాలా ప్రాధాన్యతనిచ్చేవాడు. కాని మంత్రి నారాయణ సొంతంగా చొరవతీసుకుని ఆనం సోదరులను తెలుగుదేశంలోకి తీసుకురావడం తెలిసిందే! అప్పుడే ఆదాలకు మండింది. ఆరోజుకు ఆయన సరేలే అని ఊరుకున్నాడు. ఆ తర్వాత ఆనం సోదరుల ప్రమేయంతో ఆదాల క్రిందే మంటపెట్టే ప్రయత్నం జరిగింది. ఆనం బ్రదర్స్ డైరెక్షన్‌లో నెల్లూరు నగరం బాధ్యతలు ఆనం బ్రదర్స్ చూసుకునేలా, నెల్లూరు గ్రామీణ ఇన్‌ఛార్జ్‌గా నారాయణను నియమించేలా మాట్లాడుకున్నారు. ఇది తెలిసి ఆదాల సీరియస్ అయ్యాడు. జన్మభూమి సభలలో కూడా పాల్గొనకుండా చంద్రబాబు వద్దే పంచాయితీ పెట్టాడు. చివరకు చంద్రబాబు కొత్త మార్పులు లేకుండా ఆదాలనే రూరల్ ఇన్‌ఛార్జ్‌గా కొనసాగేలా చేసాడు.

ఇంతవరకు బాగానే వుంది. కాని నారాయణతో కలిసి ఆనం సోదరులు తనకు పొగపెడతారనే భయం ఆదాలలో ఉంది. ఈ నేపథ్యంలో నారాయణతోనే తాడోపేడో తేల్చుకుంటే సరిపోతుందనుకుంటున్నాడు. ఈ తరుణంలోనే నెల్లూరులో అక్రమ కట్టడాల కూల్చివేత సబ్జెక్ట్ ఆయనకు అస్త్రంగా దొరికింది. దీనిని పెట్టుకునే నారాయణపై ఆదాల విమర్శలు ఎక్కుపెట్టాడు. విజయవాడలో కూర్చుని నిర్ణయాలు తీసుకుంటే సరిపోదని, ప్రజల మధ్య వుండే మేమేం కావాలంటూ ఆయన నారాయణపై గట్టిగానే దాడి చేశాడు. దాదాపు నెల్లూరు నగరం సగభాగం రూరల్ నియోజకవర్గం పరిధిలోకి వస్తుంది. కూల్చివేతల ప్రభావం ఆదాల మీద కూడా పడుతుంది. రాబోయే ఎన్నికల్లో ఈ ప్రభావం ఖచ్చితంగా పార్టీపై పడుతుంది. దీనిని దృష్టిలో పెట్టుకోవడంతో పాటు ఆనం సోదరులతో అంటకాగుతున్న నారాయణను ఎండగట్టేందుకే ఆదాల ఆయనతో తాడోపేడో తేల్చుకునే పనిలో వున్నాడని తెలుస్తోంది.

# నెల్లూరు కబుర్లు

### ఆ రెండ్రోజులు

## మేయర్ ఫోన్ స్విచ్ఛాఫ్

నెల్లూరు నగరంలో అక్రమ కట్టడాల కూల్చివేతలు జరిగిన 17, 18తేదీలలో నగర మేయర్ అబ్దుల్ అజీజ్ తన సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకుని అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. కట్టడాల కూల్చివేత మొదలైతే మొదటగా ఒత్తిళ్ళు వచ్చేది మేయర్ మీదే! ఎందుకంటే నగరంలో చాలామందితో మొహమాటం ఉంటుంది. భవన యజమానులతో సంబంధ బాంధవ్యాలుంటాయి. వాళ్లంతా వచ్చి ఏదో ఒకటి చేయమని అడిగితే మేయర్‌గా నేను చేయలేనని చేతులెత్తేయలేడు. ఈ విషయాన్నే మేయర్ అజీజ్ నారాయణ దృష్టికి తీసుకెళితే, ఈ విషయంలో జోక్యం చేసుకోకు, కూల్చివేతలు మొదలయ్యే రోజు నుండి నీ సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకుని వెళ్లిపొమ్మని చెప్పాడని సమాచారం. దాంతో అజీజ్ ప్రజా సంబంధాల నిమిత్తం వాడే ఫోన్ ఆ రెండ్రోజులు పని చేయలేదు.

## నారాయణకు శాపనార్థాలు

నెల్లూరు నగరపాలక సంస్థ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది ఈ నెల 17, 18, 19తేదీలలో నగరంలో మండపాలవీధి, శెట్టిగుంటరోడ్డు, పొగతోట వంటి చోట్ల అక్రమ కట్టడాలను కూల్చడం తెలిసిందే! ఈ సమయంలో బాధితుల నోట బూతుల పంచాంగమే వచ్చింది. ముఖ్యంగా మంత్రి నారాయణనైతే ఎన్ని రకాలుగా తిట్టాలో అన్ని రకాలుగా తిట్టడం వినిపించింది. చాలా పరుషపదజాలంతో మంత్రిని, మేయర్‌ను, అధికారులను బాధితులు పొగిడారు.

## 'మెంటల్'పై పోలీస్ విజయం




'పోలీసోడి పెళ్లాం', 'పోలీస్ రౌడీ', 'ఇద్దరు పెళ్లాల ముద్దుల పోలీస్', 'రౌడీ ఇన్స్‌పెక్టర్'... పోలీసు పేరుతో ఇంకా కొన్ని ఇలాంటి సినిమాలున్నాయి. ఈ సినిమాలలో పోలీసులను కించపరచకపోయినా, చదివేందుకు ఆ టైటిల్స్ మాత్రం పోలీసులకు ఇబ్బందిగానే వుంటాయి. ఈ పరంపరలో ఇటీవల వచ్చిన మరో టైటిలే 'మెంటల్ పోలీస్'. శ్రీకాంత్ హీరోగా నటించిన సినిమా ఇది. వాస్తవానికి పోలీసులను హీరోలుగా చూపించే సినిమానే అయినా టైటిల్ మాత్రం పోలీసుల గౌరవానికి భంగం కలిగించేదే! పోలీసుల మనోభావాలను గాయపరిచే ఈ సినిమా టైటిల్‌ను మార్చాలంటూ పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు వై.శ్రీహరి న్యాయపోరాటానికి దిగారు. హైకోర్టులో పిటిషన్ వేశారు. హైకోర్టు కూడా ఈ సినిమా టైటిల్‌ను మార్చాలంటూ ఏప్రిల్‌లో ఈ సినిమా విడుదల కాకుండా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఎట్టకేలకు సినిమా యూనిట్ ఈ సినిమా టైటిల్‌లో వున్న పోలీస్‌ను తీసేసి 'మెంటల్'ను ఖరారు చేసింది. ఈ నిర్ణయం పట్ల పోలీసు అధికారుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు వై.శ్రీహరి హర్షం వ్యక్తం చేశారు.

## వ్యాపార చట్టాలను సవరించాలి

ఆంధ్రప్రదేశ్ ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటుందని, దీన్ని అధిగమించి ప్రగతిపథం వైపు పయనించాలంటే వ్యాపార, వాణిజ్య పారిశ్రామిక వర్గాల చట్టాలను సవరించి ప్రోత్సహించాలని ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ అధ్యక్షుడు వక్కలగడ్డ భాస్కరరావు పేర్కొన్నారు. ఇటీవల నెల్లూరు స్టోన్‌హౌస్‌పేట రేబాలవారివీధిలో సంస్థ ఉపాధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ పొరుగు రాష్ట్రాల్లో మాదిరిగా ప్రభుత్వ పన్ను విధానాన్ని సరళీకృతం చేసి వ్యాపార, వాణిజ్య పారిశ్రామికవర్గాలను ప్రోత్సహించాలని కోరారు. తమిళనాడు, తెలంగాణ, మహారాష్ట్ర, కేరళ, కర్ణాటక తదితర రాష్ట్రాల్లో అమలవుతున్న పన్ను విధానాలను తెలియజేశారు. కొందరు అవినీతి అధికారుల పనితీరు కారణంగా రాష్ట్ర ప్రభుత్వానికి చెడ్డపేరొస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ గమిని సుబ్బారావు, ఛైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, కార్యవర్గసభ్యులు పెసల నరశింహులు స్వామి, చలువాది నాగేశ్వరరావు, సొల్లేటి వెలుగొండయ్య తదితరులు పాల్గొన్నారు.



## 'మనం' రక్తదానం

ఈ నెల 17వ తేదీన నెల్లూరులో 'మనం' స్వచ్ఛంధ సంస్థ నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని మాజీఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి ప్రారంభించారు. ఈ శిబిరంలో దాదాపు వందమంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు ఖాజావలి, మనం సంస్థ అధ్యక్షులు ముజీర్, రమణమ్మ, శారదమ్మ తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ ప్రతిభాశీలురకు పురస్కారం



చదువుల్లో రాణించి మంచి ఫలితాలు సాధించిన పోలీసు కుటుంబాల విద్యార్థులకు ఎస్పీ విశాల్‌గున్ని చేతులమీదుగా పురస్కారాలు అందజేశారు. ఈ నెల 18వ తేదీన నెల్లూరు పోలీస్ గ్రౌండ్‌లోని ఉమేష్‌చంద్ర పోలీస్ మెమోరియల్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన 75మందికి, ఇంటర్మీడియట్‌లో ప్రతిభ చూపిన 64మందికి పురస్కారాలు అందజేశారు. మెడిసిన్‌లో సీట్లు సాధించిన శ్రీహర్ష, వై.లహరిప్రియలను కూడా ఆయన అభినందించారు.

ఈ కార్యక్రమంలో ఎస్పీ సతీమణి నేహావిశాల్, ఏఎస్పీ శరత్‌బాబు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు యం.ప్రసాద్‌రావు, రాష్ట్ర గౌరవాధ్యక్షులు యం.గంగాధర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం, జిల్లా ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, సభ్యులు రూప, పరమేశ్వరి, లక్ష్మీపతి, నరసయ్య, వేణుగోపాల్, భాస్కర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్జెడిగా లాల్‌జాన్

నెల్లూరుజిల్లా పౌరసంబంధాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ లాల్‌జాన్‌కు ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు నెల్లూరు, ఒంగోలు, గుంటూరు జిల్లాల ఆర్‌జేడీగా(ఎఫ్‌ఎసి) బాధ్యతలు నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేసింది.

## డిఎస్పీలు బదిలీ

నెల్లూరుజిల్లాలో ముగ్గురు డిఎస్పీలను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. నెల్లూరు డిసిబి డిఎస్పీగా పనిచేస్తున్న విక్రమ శ్రీనివాసరావును గుంటూరురూరల్ ఎస్సీ, ఎస్టీ సెల్-1 డిఎస్పీగా, డిసిఆర్‌బి డిఎస్పీ బి.సీతారామయ్యను గుంటూరు అర్బన్ ఎస్సీ, ఎస్టీ సెల్-1 డిఎస్పీగా బదిలీ చేశారు. నెల్లూరు సిసిఎస్ డిఎస్పీ పి.శ్రీధర్‌ను ప్రకాశం ఎస్సీ, ఎస్టీ సెల్-1 డిఎస్పీగా బదిలీ చేశారు.

### ఇన్‌ఛార్జి ఇరిగేషన్ ఎస్ఇగా

## కోటేశ్వరరావు

తెలుగుగంగ ఇన్‌ఛార్జి ఎస్ఇగా పని చేస్తున్న కె.కోటేశ్వరరావుకు ఇరిగేషన్ ఎస్ఇగా అదనపు బాధ్యతలను అప్పగిస్తూ కలెక్టర్ జానకి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం సోమశిల ఎస్ఇ పి.వి.సుబ్బారావు ఇరిగేషన్ ఎస్ఇగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయన్ను అదనపు బాధ్యతల నుంచి తప్పిస్తూ తెలుగుగంగ ఎస్ఇకి బాధ్యతలను అప్పగించారు.

### వైద్యశిక్షణ మండలి

## అధికారిగా డాక్టర్ రమ

నెల్లూరుజిల్లా వైద్యశిక్షణ మండలి అధికారిగా డాక్టర్ రమను సోమవారం ప్రభుత్వం నియమించింది. ఈమె ఇప్పటి వరకు నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్నారు. ప్రభుత్వం క్లస్టర్ వ్యవస్థను రద్దు చేయడంతో ఇప్పటివరకు శిక్షణ మండలి ఇన్‌ఛార్జ్ అధికారిగా ఉన్న డాక్టర్ ఉమామహేశ్వరి తన పూర్వ స్థానం బుచ్చిరెడ్డిపాలెంకు వెళ్లారు. దీంతో ఏర్పడిన ఖాళీని భర్తీ చేసేందుకు డాక్టర్ రమను నియమించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎంల నైపుణ్యత పెంచేందుకు కృషి చేస్తామన్నారు.



### వాణిజ్య పన్నుల శాఖ

## ఎన్జీఓ సంఘ అధ్యక్షుడిగా పెరుగు

వాణిజ్య పన్నుల శాఖ నాన్‌గెజిటెడ్ ఉద్యోగుల నెల్లూరు డివిజన్ అధ్యక్షుడిగా ఎసిటిఓ పెరుగు రామకృష్ణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్జీఓ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాశీబొట్ల సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణలు రామకృష్ణను ఎంపిక చేశారు. దాదాపు పదేళ్లుగా ఈ బాధ్యతలు నిర్వహిస్తున్న కోటేశ్వరరెడ్డి ఉద్యోగ విరమణ చేశారు. రామకృష్ణ గతంలో రాష్ట్ర కార్యదర్శిగా, డివిజన్ కార్యదర్శిగా, ఉపాధ్యక్షులుగా పదవీబాధ్యతలు నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ నెల్లూరు డివిజన్ పరిధిలోని నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో పనిచేస్తున్న ఎన్జీఓ ఉద్యోగుల సంక్షేమం కోసం పని చేస్తానన్నారు.

## జీవనసరళిపై అవగాహన సదస్సు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎల్.మాధవి

ప్రపంచ ఆరోగ్య పరిరక్షణ జీవన సరళిపై అవగాహన సదస్సు సోమవారం నెల్లూరు విఆర్‌సి మైదానంలో జరిగింది. విఆర్‌సి వాకర్స్, విఆర్‌సి వనితా వాకర్స్ పాల్గొన్న ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా ఎల్.మాధవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మనం తీసుకునే ఆహారం మీద, ప్రోటీన్స్ మీద మన జీవనశైలి గురించి ఆమె ప్రసంగించారు. సమతుల్యమైన ఆహారం తీసుకుంటూ ప్రతిరోజూ వ్యాయామం చేస్తే ఆరోగ్యం బాగుంటుందని మాధవి తెలిపారు. ఎం.వి.సుబ్బారెడ్డి ఆరోగ్య సూచనలను గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విఆర్‌సి వాకర్స్ అధ్యక్షులు పందిళ్ళపల్లి పట్టాభిరామిరెడ్డి, కార్యదర్శి రమణమూర్తి, విఆర్‌సి వనితా వాకర్స్ అధ్యక్షురాలు జి.అనురాధమ్మ, డా॥ శైలజ, డా॥ చంద్రలీల, లతమ్మ, వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.

## శాకాంబరిగా ఇరుకళల పరమేశ్వరీదేవి



సింహపురి గ్రామదేవత, నెల్లూరు చెరువుగట్టుపై వెలసి వున్న ఇరుకళల పరమేశ్వరీదేవికి ఈ నెల 17న ఆలయ అర్చకులు కన్నుల పండువగా శాకాంబరి అలంకారం నిర్వహించారు. పండ్లు, ఆకుకూరలు, కూరగాయలతో అమ్మవారిని శోభాయమానంగా అలంకరించారు. ఆలయ మండపాన్ని సైతం కూరగాయాలు, పండ్లతో అద్భుతంగా అలంకరించారు. పాడిపంటలతో రాష్ట్రం కళకళలాడాలని, ప్రజలంతా సుఖశాంతులతో జీవించాలని ప్రార్థిస్తూ అమ్మవారి ఆలయంలో ఈ వేడుక నిర్వహించారు. అనంతరం అమ్మవారికి విశేష పూజలు, అభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పులికొలను చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి. ఈ వేడుకలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని కనులారా దర్శించుకుని తరించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. అమ్మవారి శాకాంబరి అలంకారానికి ఉభయకర్తగా గంగిశెట్టి సాయికుమార్ వ్యవహరించగా, విజయడెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, జిల్లా దేవాదాయశాఖ సహాయ కమిషనర్ వి.రవీంద్రరెడ్డితో పాటు ఆలయ ఛైర్మన్ మెట్టు సురేష్‌బాబు, ఆలయ పాలకమండలి సభ్యులు శ్రీహరిఆచారి, సుధాకర యాదవ్, రాపూరు కృష్ణసుధ, పి.వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, ఆలయ కార్యనిర్వహణాధికారి యు.జానకి తదితరులు ఈ వేడుకలను పర్యవేక్షించారు. శాకాంబరి అలంకారంలో కొలువుదీరిన అమ్మవారిని నగరంలోని ప్రముఖులు, ప్రజలు భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు.

## ఆటో వంశీకి
# కాకాణి కుమార్తె విరాళం



ఆపదలో వున్న అభాగ్యుడికి మానవతామూర్తుల ఆపన్న హస్తం అందుతూనే వుంది. ప్రమాదంలో గాయపడిన 'ఆటో వంశీ' కుటుంబానికి సర్వేపల్లి శాసనసభ్యుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె పూజిత లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించింది. రూరల్ శాసనసభ్యుడు తమ సమీప బంధువు అయిన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డితో కలిసి కొత్తూరులోని వంశీ ఇంటికి వెళ్లి వంశీ భార్య గీతకు పూజిత లక్ష రూపాయలను అందించింది. ఈ సందర్భంగా పూజిత మాట్లాడుతూ మెరుగైన వైద్య చికిత్స కోసం ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని తనవంతు సహాయాన్ని అందించానన్నారు. ఇలాంటి కార్యక్రమాలకు తన తండ్రిని స్ఫూర్తిదాయకంగా తీసుకుని ఆర్థిక సహాయాన్ని అందించానని తెలిపారు. వంశీ కుటుంబసభ్యుల్ని పరామర్శించి వంశీ త్వరగా కోలుకోవాలని కోరారు. నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ చిన్న వయస్సులోనే పెద్ద మనస్సుతో దాతృత్వం చూపిన పూజితను అభినందించారు. పూజితను ఆదర్శంగా తీసుకుని ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు మరింతమంది ముందుకు రావాలని కోరారు.

## విఎస్‌యు విద్యార్థులకు...
# 'అగ్ని' పరీక్షలు




*సౌకర్యవంతంగా లేని తరగతి గదులు... అందుబాటులో లేని లైబ్రరీ... అరకొర వసతులు... క్లాసులకు రాని అధ్యాపకులు... పూర్తికాని సిలబస్... తెరచుకోని హాస్టల్... పట్టించుకోని యాజమాన్యం... విద్యా సంవత్సరం మొత్తంమ్మీద ఆందోళనలు, వివాదాలు... ఇన్ని సమస్యలకు నెలవైన విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో చదివే విద్యార్థులకు నిత్యం పరీక్షలే!*

అయితే చదువుకు సంబంధించి అసలైన పరీక్షలు ప్రారంభం కాబోతున్నాయి. 2015-16 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంబిఏ, ఎంసిఏ, ఎల్ఎల్‌బి కోర్సులలో పలు సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. అధ్యాపకులు రాని కారణంతో పాటు కొన్ని సబ్జెక్టులు బోధించేందుకు అధ్యాపకులు లేక విద్యార్థుల చదువులు అంతంతమాత్రంగా సాగాయి. కనీసం సబ్జెక్టులపై విద్యార్థుల్లో వున్న సందేహాలను నివృత్తి చేసే దిక్కు కూడా లేకుండా పోయింది. ఈ సమస్యల కారణంగానే టూరిజం మేనేజ్‌మెంట్ పరీక్షలను వాయిదా వేయించుకోగలిగారు. కాని ఎంసిఏ, ఎంబిఏ, ఎల్ఎల్‌బి పరీక్షలను వాయిదా వేయించాలనుకున్న విద్యార్థి సంఘాల ప్రయత్నాలు మాత్రం సఫలమవ్వలేదు. సిలబస్ పూర్తి కాకుండా, సబ్జెక్ట్‌ను పూర్తిగా తలకెక్కించుకోకుండా పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థుల పరిస్థితి ఏ విధంగా ఉందంటే తూటాలు లేని తుపాకీతో కదనరంగంలో దూకినట్లుగా వుంది.

# కృష్ణపట్నం పోర్టులో 'ఆత్మగౌరవం'



కృష్ణపట్నం పోర్టులో 'ఆత్మగౌరవం' జిల్లా స్థాయి వర్క్‌షాపు ఈ నెల 16న నిర్వహించారు. జిల్లా కలెక్టర్ శ్రీమతి యం.జానకి జ్యోతి ప్రజ్వలన చేసి రెండు రోజుల ఈ వర్క్‌షాపును ప్రారంభించారు. అందులో భాగంగా మొదటిరోజు వివిధ అంశాలపై జిల్లాలోని తహశీల్దార్లు, ఎంపిడిఓలు, జిల్లా అధికారులు తమ అభిప్రాయాలను, సలహాలను, సూచనలను ఈ సమావేశంలో తెలిపారు. స్వచ్ఛభారత్, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా 'ప్రతి ఇంటా మరుగుదొడ్డి కట్టుకుందాం మన ఆత్మగౌరవాన్ని పెంపొందించుకుందాం' అంటూ ప్రజలను చైతన్య పరచే విధంగా అందరూ ముందుకు సాగాలని కలెక్టర్ వారికి సూచించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో బహిరంగ మలవిసర్జన లేకుండా చేయాలనే లక్ష్యంతో అధికారులు గ్రామంలోని ప్రజలను చైతన్య పరచి వారు మరుగుదొడ్లను నిర్మించుకొని ఉపయోగించుకొనే విధంగా చేయాలన్నారు. కార్యక్రమంలో గూడూరు సబ్‌కలెక్టర్ గిరీషా, జిల్లా పరిషత్ సిఇఓ రామిరెడ్డి, పోర్టు పిఆర్. హెడ్ జి.వేణు గోపాల్, జిల్లా ఉన్నతాధికారులు, తహశీల్దార్లు, ఎంపిడిఓలు తదితరులు పాల్గొన్నారు.

# కొంపలు కూల్చే పనులొద్దు
## - వైకాపా నేతలు



మీకు చేతనైతే మనుషులను, వాళ్లు కట్టుకుంటున్న ఇళ్లను నిలబెట్టండి, అంతేగాని అక్రమ కట్టడాలని ముద్రవేసి వాళ్లు నానా తంటాలుపడి కట్టుకున్న ఇళ్లను కూల్చొద్దని నెల్లూరు డిప్యూటీ మేయర్ యం.ద్వారకానాథ్, వైకాపా ఫ్లోర్‌లీడర్ పి.రూప్‌కుమార్ యాదవ్‌లు పేర్కొన్నారు. ఈ నెల 18వ తేదీన కార్పొరేషన్ కార్యాలయంలోని డిప్యూటీ మేయర్ ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పేద, మధ్య తరగతి ప్రజలు అప్పో సొప్పో చేసి రెక్కల కష్టంతో ఇళ్లులు కట్టుకుంటున్నారు. పెరిగిన ధరలతో ఇల్లు కట్టుకోవడం ఎంత భారంగా మారిందో మీకు తెలియంది కాదు, అక్రమ కట్టడాలు కట్టేటప్పుడు మాత్రం కలెక్షన్‌లు దండుకున్న అధికారులు, ఇప్పుడు గడ్డపారలు తీసుకుని అక్రమ కట్టడాలను కూల్చేస్తామని చెప్పడం విడ్డూరంగా వుంది. నెల్లూరులో ఏ మూల ఏ కట్టడం అక్రమం అనే విషయం విజయవాడలో కూర్చున్న మంత్రికి తెలియదేమో! నెల్లూరులో వున్న కార్పొరేషన్ అధికారులకు తెలుసు. వారి అండ లేకుండా అక్రమ కట్టడాల నిర్మాణమే లేదు. అక్రమ కట్టడాలను కూలిస్తే పూర్తిగా నష్టపోయేది ప్రజలు. ముందు వారిని భయభ్రాంతులకు గురి చేయడం మానేసి, అక్రమ కట్టడాల క్రమబద్ధీకరణకు అవకాశమివ్వాలని వారు డిమాండ్ చేశారు.

ఈ సమావేశంలో వైసిపి కార్పొరేటర్లు లేబూరు పరమేశ్వరరెడ్డి, ఊటుకూరు మాధవయ్య, ఖలీల్, రవిచంద్ర, నాగరాజు, అశోక్, పాతపాటి పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# పల్స్ సర్వే జయప్రదం చేయాలి
## - జాయింట్ కలెక్టర్ ఎ.ఎం.డి. ఇంతియాజ్



జిల్లాలో ప్రతిష్టాత్మకంగా ప్రజలకు సంబంధించిన సమగ్ర సమాచారం సేకరించేందుకు నిర్దేశించిన ప్రజాసాధికారత సర్వేను ఎలాంటి సమస్యలు లేకుండా సమర్థవంతంగా నిర్వహించి త్వరితగతిన పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఎ.ఎం.డి. ఇంతియాజ్ పేర్కొన్నారు.

ఈ నెల 19వ తేదీ కలెక్టరేట్ గ్రీవెన్‌సెల్‌హాల్లో నెల్లూరు నగర పరిధిలో జరిగే ప్రజాసాధికారత సర్వేపై సంబంధిత సూపర్‌వైజర్లు, అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాసాధికారత సర్వేకు నియమించిన సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలన్నారు. ఈ సర్వేకు జిల్లాలో దాదాపు 1900మంది ఎన్యుమరేటర్లను నియమించగా అందులో నెల్లూరు నగర కార్పొరేషన్‌లో 317 మంది ఎన్యుమరేటర్లను నియమించడం జరిగిందన్నారు.

ఈ సర్వే ప్రక్రియలో ఎవరైనా గైర్హాజరైనా, నిర్లక్ష్యం వహించినా సంబంధిత ఎన్యుమరేటర్లపై క్రమశిక్షణా చర్యలు చేపట్టడం జరుగుతుందని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ ప్రజా సాధికారత సర్వేపై మరియు కుటుంబాల ప్రయోజనం గురించి తెలియజేసి, సమగ్రంగా నిర్దేశించిన సమాచారాన్ని పూర్తి స్థాయిలో సర్వేలో నమోదు చేయాలన్నారు. ఆ సర్వేలో చంద్రన్న బీమా యోజన, ఆర్థిక ప్రయోజన పథకాలకు సంబంధించిన విషయాలను కూడా కుటుంబ సభ్యుల నుండి సమాచారం సేకరించాలన్నారు.

ఈ కార్యక్రమంలో నగర కమిషనర్ వెంకటేశ్వర్లు, సివిల్ సప్లయిస్ డిప్యూటీ కలెక్టర్ వెంకటసుబ్బయ్య, సర్వేకు సంబంధించిన సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.




# కార్పొరేషన్ ద్వారా బ్రాహ్మణులకు కోఆపరేషన్

గూడూరు శ్రీరామరక్ష కుటీరంలో ఈ నెల 17వ తేదీ ఉదయం గూడూరు బ్రాహ్మణ సేవాసంఘం విస్తృత సమావేశం సంఘ అధ్యక్షుడు యరగుడిపాటి చలపతి రావు అధ్యక్షతన జరిగింది.

పైసభలో రాష్ట్ర ప్రభుత్వం బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేసి 70కోట్ల వరకు నిధులు సమకూర్చిందని, దాన్ని పేద, అనారోగ్య, విద్య, వృత్తి మొదలగు వాటికి ఈ నిధులను ఉపయో గించుకోవచ్చని అధ్యక్షులు వై.చలపతిరావు తెలియజేశారు. ఐఏఎస్ ప్రిలిమ్స్ ప్రిపరేషన్‌కు ఉచిత వసతి మరియు భోజనం, కోచింగ్ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ బ్రహ్మణ కార్పొరేషన్ ప్రారంభించి హితోధికంగా బ్రాహ్మణులకు సహాయసహకారాలు అందిస్తున్న ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, కార్పొరేషన్ ఛైర్మెన్ ఐవైఆర్ కృష్ణారావు లకి అభినందనలు తెలిపారు. బ్రాహ్మణ సంఘానికి ఉన్న స్థలంలో శాశ్వత భవనం మరియు కళ్యాణ మండపం ఏర్పాటు చేస్తామన్నారు. పై సభలో ఏపి బ్రాహ్మణ, కార్పొరేషన్ జిల్లా కో-ఆర్డినేటర్ మరియు



సమావేశంలో మాట్లాడుతున్న వై.చలపతిరావు

నెల్లూరు మున్సిపల్ కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్ పాల్గొని పై కార్యక్రమాన్ని విశదీకరించారు. గూడూరులో రాష్ట్రంలోనే మొట్టమొదటి సారిగా బ్రాహ్మణ కార్పొరేషన్ తరఫున చెట్లు నాటే కార్యక్రమాన్ని కూడా కోఆర్డినేటర్ భువనేశ్వరీ ప్రసాద్ ప్రారంభించారు. ఈ సభలో బ్రాహ్మణ సేవాసంఘ జిల్లా ఉపాధ్యక్షులు స్వయంపాకుల శ్రీనివాసులు మరియు రాష్ట్ర కోశాధికారి ఐ.కె.ప్రసాద్ పాల్గొని మాట్లాడారు. ఈ సభలో ఆనిమెళ్ళ శివ కుమార్‌ను బ్రహ్మణ సేవాసంఘం ఉపాధ్యక్షులుగా ఏకగ్రీవంగా హర్షధ్వానాల మధ్య నియమించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో నెల్లూరుజిల్లా బ్రాహ్మణ సేవాసంఘం అధ్యక్షులు వాసుదేవరావు, గౌరవాధ్యక్షులు ఎస్.నాగరాజారావు, కార్యదర్శి శ్రీనివాసరావు, కోశాధికారి రమణ, స్వయంపాకుల శ్రీనివాసులు, నాథబ్రహ్మం, చిట్టిబాబు, గురుగుహ, పవన్, సభ్యులు వై.లలితమ్మ తదితరులు పాల్గొన్నారు.



హరితహారంలో భాగంగా ఇటీవల గూడూరు పాలిటెక్నిక్ కళాశాలలో మొక్కలు నాటిన ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, టూటౌన్ ఎస్ఐ నరేష్, ప్రిన్సిపాల్ విజయకుమార్, ఎన్.మల్లికార్జునరావు తదితరులు

## గూడూరు డివిజన్ వార్తలు

# అభివృద్ధి కార్యక్రమాల్లో జిల్లా ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ విశాల్‌గున్ని, ప్రక్కన డిఎస్పీ శ్రీనివాస్

గూడూరు పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి జిల్లా ఎస్పీ విశాల్‌గున్ని, ఆయన సతీమణి నేహ గున్నీ ఈ నెల 16వ తేదీన గూడూరుకు వచ్చారు. తొలుత డిఎస్పీ కార్యాలయం వద్ద వారికి ఘనస్వాగతం పలికారు. పట్టణంలో ఆధునీకరించిన డిఎస్పీ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన రిసెప్షన్, ఫిర్యాదుదారుల గదిని, కార్యాలయ సిబ్బంది గదులను పరిశీలించారు. దాతల సహకారంతో ఆధునీకరించిన గ్రామీణ పోలీస్‌స్టేషన్‌ను గూడూరు డిఎస్పీ బి.శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. పట్టణంలోని గడియారపు స్థంభం కూడలి వద్ద సంఘం థియేటర్ కూడలి ప్రాంతాల్లో హిందూధర్మ పరిషత్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ ఐల్యాండ్‌ను దాత కోట సునీల్ కుమార్‌తో కలిసి ప్రారంభించారు. గ్రామీణ పోలీస్‌స్టేషన్‌లో ఎస్పి సతీమణి చేతుల మీదుగా విశాల్‌గున్ని ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎస్పీ విశాల్‌గున్ని మాట్లాడుతూ ప్రతి పోలీస్ స్టేషన్‌లో ప్రజలకు మెరుగైన న్యాయం చేయడానికి రిసెప్షన్ కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ క్రమంలో జిల్లా వ్యాప్తంగా 64మంది మహిళా పోలీసులు, కానిస్టేబుల్స్‌కు స్మార్ట్ పోలీసింగ్‌పై ప్రత్యేకశిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో గతేడాదితో పోల్చితే ప్రస్తుతం క్రైం రేటు 10శాతం వరకు తగ్గిందన్నారు. గూడూరు పట్టణంలోని ఔట్‌పోస్టుల్లో త్వరలోనే సిబ్బంది ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐలు సుబ్బారావు, శ్రీనివాసులురెడ్డి, శ్రీనివాసులు, రత్నయ్య, అక్కేశ్వరరావు, ఎస్ఐలు బాబి, నరేష్, జగన్‌మోహన్‌రావు, మారుతీకృష్ణ, రవినాయక్, పట్టణ నాయకులు కె.మునిగిరీష్, మనపాటి రవి తదితరులు పాల్గొన్నారు.

# సాయి మందిరంలో పేదలకు దుస్తులు



దుస్తులు పంపిణీ చేస్తున్న డాక్టర్లు జనార్ధన్‌రెడ్డి, రోహిణి

గూడూరు పట్టణ సమీపానున్న షిరిడి సాయిబాబా మందిరంలో ఈ నెల 16వ తేదీ పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. మనుబోలు మండలం కట్టువపల్లి ప్రాంతానికి చెందిన పోచారెడ్డి జానారెడ్డి కుమారుడు ప్రభాకర్‌రెడ్డి, శేషారెడ్డి సహకారంతో దాదాపు 500మందికి వైద్యులు చెరుకూరు జనార్ధన్‌రెడ్డి, సి.రోహిణి చేతులమీదుగా వీటిని అందజేశారు. ఈ సందర్భంగా డా॥ జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి మనిషికి ఆహారం, దుస్తులు ఉండటానికి ఇల్లు ముఖ్యమని చెప్పారు. పేదలను గుర్తించి దుస్తులు ఇవ్వడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సోమిశెట్టి చెంచురామయ్య, ఆడిటర్ నాగరాజు, కట్టా సుధాకర్, కోటి తదితరులు పాల్గొన్నారు.




# అవధానంలో అల్లూరుకు కీర్తి

## కోట రాజశేఖర్‌కు ఆత్మీయసన్మానం



ప్రముఖ అవధాని, విశ్రాంత సంస్కృతోపన్యాసకులు కోట రాజశేఖర్‌కు అల్లూరులో ఈ నెల 17న ఘనంగా ఆత్మీయ సన్మానం జరిగింది. అవధాన ప్రక్రియలో మంచి పరిణతిని సాధిస్తూ రాష్ట్రవ్యాప్త ఖ్యాతినార్జించిన రాజశేఖర్‌ను ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన 'అవధాన విద్యాసర్వస్వము' గ్రంథావిష్కరణ సభలో శ్రీ సిద్ధేశ్వరానంద భారతీస్వాములవారి సమక్షంలో ఘనంగా సన్మానించిన సందర్భాన్ని పురస్కరించుకుని, అల్లూరుకు చెందిన ప్రముఖ రంగస్థలనటుడు బడబాగ్ని ఆంజనేయరాజు నేతృత్వంలో రాజశేఖర్‌కు ఆయన మిత్రులు, సహచరులు ఆత్మీయ సన్మానం నిర్వహించారు. స్థానిక ప్రముఖులు అనంతరాజు బాలకృష్ణమరాజు, యానాదిశెట్టి, సినీ దర్శకుడు రమణరావు, రామకృష్ణ జూనియర్ కళాశాల హెడ్మాస్టర్ కె. శ్రీనివాసులు, సంస్కృత పండితులు రాఘవన్, సిద్ధార్థ స్కూల్ అధినేత హనుమాచార్యులు, 'లాయర్' వారపత్రిక సబ్‌ఎడిటర్ మద్దూరు శ్రీనివాసులు, పాత్రికేయుడు మేడా శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొని అవధాన ప్రక్రియలో అల్లూరు కీర్తిని ఇనుమడింపజేస్తున్న రాజశేఖర్ ప్రతిభాపాటవాలను కొనియాడారు. 'అవధాన విద్యాసర్వస్వము' అనే బృహత్‌గ్రంథంలో కోట రాజశేఖర్ జీవిత వివరాలను, ఆయన అవధాన విశిష్టతను ఆరుపేజీలలో పేర్కొనడం ఎంతో సంతోషకరమని ఈ సందర్భంగా అందరూ ఆయనను అభినందించారు. అనంతరం మిత్రులు, సహచరులు అవధానిని శాలువాలతో సత్కరించి తమ ఆత్మీయతను చాటుకున్నారు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

వృత్తిపరంగా ఆదాయం బాగుంటుంది. వ్యాపార వర్గాలకు ఆటంకాలు తొలగి అభివృద్ధి బాగుంటుంది. అనుకున్న లక్ష్యాలు నెరవేరుతాయి. శుభవార్తలు వింటారు. సొంత నిర్ణయాల వల్ల ప్రయోజనం పొందుతారు. అనుకున్న పనులు సక్రమంగా జరుగుతాయి. ఉద్యోగులకు సమర్థత గౌరవం బాగుంటుంది. శుభకార్య ప్రయత్నాలు ఫలించడం, ఇతరులకు సహాయం చేస్తారు.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

న్యాయ, వైద్య, సాంకేతిక, శాస్త్ర పరిశోధనా రంగాల వారికి మంచి ప్రోత్సాహం ఉంటుంది. ఆర్థికంగా బలపడతారు. ఆదాయం పెరుగుతుంది. ఉద్యోగులకు ఉన్నతస్థితి, బాధ్యతలు పెరుగుతాయి. శుభవార్తలు వింటారు. శుభకార్య ప్రయత్నాలు ఫలించగలవు. రావలసిన బాకీలు కొంత చేతికందవచ్చు. కోర్టు కేసులందు అనుకూలత, ప్రముఖులను కలుసుకొంటారు.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ధ్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

పలుకుబడి పెంచుకొనడానికి, అనుకున్న పనులు నెరవేరడానికి ఆడంబరాలకు ఖర్చులు పెరిగి, ఋణం చేయవలసి వస్తుంది. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా ఉండి ఆదాయం ఉంటుంది. ముఖ్యపత్రాలు, వస్తువులు పోగొట్టుకొనకుండా జాగ్రత్తపడాలి. ఉద్యోగ ప్రయత్నాలు చేసేవారు మరికొద్ది కాలం నిరీక్షించవలసి ఉంటుంది. శుభకార్యాలు నిర్ణయం కాగలవు.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ఆర్థికముగా బాగుండి వృత్తి వ్యాపారాలలో ఆదాయం పెరుగుతుంది. కొంత అదనపు ఖర్చులుంటాయి. సాధ్యమైనంత వరకు తగ్గించండి. ఇతరుల సలహాలు తీసికున్నా సొంత నిర్ణయాలతో ముందుకు సాగండి. శుభకార్య ప్రయత్నాలు ఫలించగలవు. స్థిరాస్తులు వృద్ధి పరుచుకొనే ప్రయత్నాలు చేస్తారు. విద్యార్థులకు మంచి అవకాశాలుంటాయి. ఆరోగ్యం బాగుంటుంది.

## సింహాం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

కుటుంబ, ఆర్థిక, ఉద్యోగ వ్యవహారాలలో జాగ్రత్తగా ఉండాలి. సన్నిహితులు బంధువుల వల్ల సమస్యలు రాగలవు. వ్యాపార అవకాశాలు తగ్గుతాయి. పొరపాటు నిర్ణయాలు, పొరపాటు సలహాలివ్వడం చేయవద్దు. కోర్టు వ్యవహారాలు, శుభకార్య నిర్ణయాలు వాయిదా పడగలవు. ఆస్తి వ్యవహారాలు, రావలసిన డబ్బులు కొంత పరిష్కారం కాగలవు. అనుకోని దూరప్రయాణాలుంటాయి.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

వృత్తి వ్యాపారాలు, లభించే ఆదాయం తృప్తికరంగా ఉంటుంది. మీ సన్నిహితులే మిమ్మల్ని విమర్శించగలరు. ఎదుటివారిని ఇబ్బందిపెట్టునట్లుగా మాట్లాడకండి. అనుకున్న పనులు టెన్షన్ పెట్టినా సవ్యంగానే సాగుతాయి. శుభకార్య ప్రయత్నాలు కొనసాగుతాయి. విద్యార్థులకు మంచి అవకాశాలు, విలువైన వస్తు సామాగ్రి కొనడం జరుగుతుంది.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

**తేది. 22.7.2016 నుండి**
**తేది. 28.7.2016 వరకు**

ఈ వారము కర్కాటకంలో రవిబుధ శుక్రులు, సింహంలో గురు రాహువులు, వృశ్చికంలో శనికుజులు, మకర కుంభ మీన మేష రాశులలో చంద్రుడు, కుంభంలో కేతువు సంచరిస్తారు.

### పంచాంగము:

ముహూర్తములు లేవు

### ఆషాఢ మాస కృష్ణపక్ష తిధులు

| | | | |
|---|---|---|---|
| తేది. 22 | శుక్ర | తదియ | రా॥ గం.2.12వ॥ |
| తేది. 23 | శని | చతుర్ధి | రా॥ గం.12.35వ॥ |
| తేది. 24 | ఆది | పంచమి | రా॥ గం.10.36వ॥ |
| తేది. 25 | సోమ | షష్ఠి | రా॥ గం.8.26వ॥ |
| తేది. 26 | మంగళ | సప్తమి | రా॥ గం.6.10వ॥ |
| తేది. 27 | బుధ | అష్టమి | సా॥ గం.3.40వ॥ |
| తేది. 28 | గురు | నవమి | ప॥ గం.1.10వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఫైనాన్స్, కాంట్రాక్టులు, బంగారు, వెండి వ్యాపారులు పబ్లిక్‌లో, అధికారులతో జాగ్రత్తపడండి. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా జరగడం, రాబడిపై అసంతృప్తి ఉంటుంది. తొందరపాటు మాటలు, ప్రవర్తన తగ్గించుకొనాలి. ముఖ్య వ్యక్తులను కలుసుకొనలేకపోవడం, అనుకోని ప్రయాణాలు చేయవలసి రావడం ఉంటుంది. అనుకున్న పనులు నిదానంగా సాగుతాయి.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి, ఆదాయం, అనుభవం లభిస్తుంది. పనులు చేపట్టినవి నిదానంగా జరుగుతాయి. రావలసిన బాకీలు వాయిదా పడతాయి. కోర్టు కేసులందు అనుకూలత, అనుకోని ఖర్చులు పైనబడటం, స్వల్పంగా ఋణం చేయడం ఉంటుంది. ఉద్యోగ ప్రయత్నాలు ఫలించగలవు. కొత్త యంత్రాలు, గృహోపకరణలు కొంటారు. శుభకార్య నిర్ణయాలు జరుగగలవు.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

కుటుంబంలో చిన్నచిన్న సమస్యలుండి బాధ కలుగుతుంది. వృత్తి వ్యాపార నిర్వహణలో సంతృప్తి ఉండదు. ఆదాయం తగ్గుతుంది. అనవసర ఖర్చులు పైనబడగలవు. బంధువులకు గాని, కుటుంబ సభ్యులకు గాని అనారోగ్య బాధలుంటాయి. అనుకున్న పనులు సరిగా జరగక టెన్షన్ పడతారు. కోర్టు వ్యవహారాలలో అసంతృప్తి, బాకీలు నిలబడిపోవడం జరుగుతుంది.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఇతరులు మీపై చేసిన విమర్శలు, నిందలు సర్దుబాటు కాగలవు. వ్యాపారవృద్ధికి, పెట్టుబడికి అవకాశాలు బాగుంటాయి. వృత్తి పరంగా తీరిక ఉండదు. ఆదాయం పెరుగుతుంది. ఖర్చులు పెరిగినా మంచి వాటికే ఉండి, భారమనిపించవు. అనుకున్న పనులు నెరవేరగలవు. బిడ్డల విద్యా విషయంలో కొద్ది ఆందోళన ఉంటుంది. రావలసిన బాకీలు కొంత అందుతాయి.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

చేపట్టిన పనులందు టెన్షన్ ఎక్కువగా ఉంటుంది. ఏదో విధంగా పనులు జరుపుకుంటారు. వ్యాపార వర్గాలకు అవకాశాలు మందగించగలవు. కోర్టు వ్యవహారాలు అసంతృప్తిని కలిగిస్తాయి. ఉద్యోగులకు సమర్ధత ఉండి పనిభారం పెరుగుతుంది. నిర్మాణాలు చేసేవారికి పనివారితో ఇబ్బందులుంటాయి. హోల్‌సేల్ వ్యాపారాలు బాగా జరుగుతాయి. ఉన్నతవిద్యావకాశాలు లభించగలవు. ఆరోగ్యం బాగుంటుంది.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

కుటుంబ సమస్యలు, ఉద్యోగ నిర్వహణలో సమస్యల వల్ల ఇబ్బందులు పడతారు. వృత్తి వ్యాపారాలు సంతృప్తికరంగా సాగుతాయి. ఆదాయం ఫరవాలేదు. కొద్ది అనవసరపు ఖర్చులు తప్పవు. ఆర్థిక లావాదేవీలను వాయిదా వేసికొనండి. పనులందు టెన్షన్ ఉంటుంది. ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు పాటించండి. శుభకార్య ప్రయత్నాలు వేగవంతం కాగలవు.

# వివేకాను దేవుడిని చేసిన నారాయణ

శ్రీను గల్పిక

విజయవాడలోని హైటెక్‌రత్న, ముఖ్యమంత్రి చంద్రబాబు కార్యాలయం. చంద్రబాబు చేతిలో పేపర్లు పట్టుకుని సీరియస్‌గా వున్నాడు. ఎదురుగా మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, పత్తిపాటి పుల్లారావు, పి.నారాయణ, పల్లె రఘునాథరెడ్డి తదితరులున్నారు. నారాయణవైపు చంద్రబాబు సీరియస్‌గా చూస్తూ... నీ ప్రోగ్రెస్ రిపోర్ట్ చూడు... సర్వేలో ఏం తేలిందో చూడు... మున్సిపల్ మంత్రిగా నీ పనితీరుకు వచ్చిన మార్కులు చూడు... వందకు ముప్పైఐదు... ఇన్ని వందల విద్యాసంస్థలు నడుపుతున్నావు, ఇన్ని లక్షల మంది విద్యార్థులకు ర్యాంకులు తెస్తున్నావు. నువ్వు మాత్రం అత్తెసరు మార్కులు తెచ్చుకున్నావు. ఇదేనా నీ పనితీరు. నీకంటే దేవినేని ఉమామహేశ్వరరావు నయం... పనితీరులో ఫస్ట్ ర్యాంకు తెచ్చుకున్నాడు, అని మందలించాడు. చంద్రబాబు మాటలతో నారాయణకు భలే బాధేసింది. నన్నెప్పుడూ మా నాయన, అమ్మ కనీసం భార్య కూడా ఇలా తిట్టలేదు. నా మానాన నేను శుభ్రంగా కాలేజీలు నడుపుకుంటుంటే, తెచ్చి రాజకీయాల్లో పడేసారు, ఈ తొక్కలో రాజకీయాల్లో మంత్రులకు మళ్లీ ర్యాంకులు... మార్కులు... అని మనసులో తిట్టుకుంటూ అప్పుడే అక్కడకు వచ్చిన బొజ్జల గోపాల కృష్ణారెడ్డిని పక్కకు పిలిచాడు. అన్నా, మీరు అనుభవజ్ఞులు... మంత్రిగా నా ర్యాంకును ఎలా మెరుగుపరుచుకోవాలో చెప్పి పుణ్యం కట్టుకోండి. మొదటి ర్యాంకు తెచ్చుకున్న ఆ దేవినేని ఉమ చేసిందేమిటి? చివరి ర్యాంకు తెచ్చుకున్న నేను చేయనిదేమిటి? తేడా ఎక్కడుందో మీరే చెప్పండని బ్రతిమలాడాడు. అందుకు బొజ్జల... మన ముఖ్యమంత్రికి కూల్చడం, కట్టడం, మొక్కలు నాటడం, చెట్లు పీకడం వంటి పనులు బాగా నచ్చుతాయి. ఈమధ్య కృష్ణ పుష్కరాలకోసమని విజయవాడలో 45 దేవాలయాలను కూల్చారు కదా... చంద్రబాబు వద్ద దేవినేనికి అక్కడే మార్కులు పడ్డాయి. కాబట్టి అలాంటివేవన్నా ఉంటే చూస్కో అని బొజ్జల సలహాఇచ్చాడు. వెంటనే నారాయణ ఆ దిశగా దృష్టి పెట్టాడు.

★ ★ ★ ★ ★

ఐఆర్ 20-420 మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమలకు ప్రసిద్ధిగాంచిన నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్. మంత్రి నారాయణతో పాటు మేయర్ అబ్దుల్ అజీజ్, టౌన్ ప్లానింగ్ డైరక్టర్ రఘు, కమిషనర్ వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పి.అనిల్‌కుమార్‌యాదవ్, స్టైల్ ఆఫ్ సింహపురి ఆనం వివేకానందరెడ్డి(65), మాజీ ఎమ్మెల్యే ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిలు వున్నారు. నారాయణ వారినుద్దేశించి మాట్లాడుతూ నగరంలో అక్రమ కట్టడాలన్నీ కూల్చాలనుకుంటున్నాం... మీ సహకారం కావాలన్నాడు. అందుకు కోటంరెడ్డి, అనిల్‌లు లేచి... అలాగే సహకరిస్తాం, కాకపోతే మొదట మీ కాలేజీ భవనాలనుండే మొదలు పెట్టండి, అలా కాకుండా సామాన్య ప్రజల కట్టడాల జోలికి పోతే ఊరుకునేది లేదంటూ హెచ్చరించి వెళ్లిపోయారు.

చంద్రమోహన్‌రెడ్డి గారు... ఈ విషయంపై మీ అభిప్రాయమేంటని నారాయణ అడిగాడు. వెంటనే సోమిరెడ్డి... వేళ్ల మీద నాలుగు నిముషాలు లెక్కలు వేసి... మంత్రి గారు, మనం కూలగొట్టేది నాలుగు వందల ఇళ్లే... కాని నాలుగు లక్షల మంది మనకు ఫేవర్ అవుతారన్నాడు. వెరీగుడ్, ఇలాంటి సలహాలే నాకు కావాలి అంటూ ఆదాల గారు... మీ అభిప్రాయం చెప్పండని నారాయణ కోరాడు. ఆదాల మాట్లాడుతూ... అభివృద్ధి కోసం మనం దేవుళ్లుంటున్న ఆలయాలనే కూల్చేస్తున్నారు, అలాంటిది తుచ్ఛ మానవులుండే ఇళ్లు ఓ లెఖ్ఖ! మీకెందుకు, మీరు కూలగొట్టండి, మీ వెనుక మేమున్నాం అని భరోసా ఇచ్చాడు. వివేకన్నా, మీరేమంటారని నారాయణ అడిగాడు. వివేకా కళ్లకు నల్లద్దాలు పెట్టుకుని అలాగే కూర్చుని వున్నాడు. నారాయణ ప్రశ్నకు ఆయనలో స్పందన లేదు. మళ్ళీ నారాయణే వుండి... వివేకన్న ఏదో దీర్ఘాలోచనలో వున్నట్లున్నారు, మన మాటలు వింటున్నట్లు లేదు అని అన్నాడు. అప్పుడు వివేకా పి.ఏ రంగరాజు వుండి... దీర్ఘాలోచనా పాడా సార్, ఆయన నిద్రపోతున్నాడు. మీరు చెప్పింది వింటున్నట్లు నటించడానికే అలా కళ్లకు నల్లద్దాలు పెట్టేసారు. నేను లేపుతానుండండి అంటూ సార్, సార్... అంటూ భుజం మీద తట్టాడు. వివేకా ఉలిక్కిపడుతూ లేచి... రాజూ, ఒక బెడ్‌కాఫీ తెమ్మని చెప్పు అని చెప్పాడు. దానికి రాజు... సార్, మీరు మీ బెడ్‌రూంలో లేరు, కార్పొరేషన్ కౌన్సిల్ హాల్‌లో వున్నారని చెప్పాడు. వివేకా వెంటనే తేరుకుని... సారీ నారాయణ, రాత్రి సెకండ్‌షోకు 'చీకట్లో చిలిపి ఆట' సినిమాకు వెళ్లాను, ఇంటికొచ్చాక కూడా ఆ సినిమా సీన్‌లే గుర్తు చేసుకుంటుండడంతో సరిగా నిద్రపట్టలేదు. ఆ ఎఫెక్టే ఇది... అయినా విషయం చెప్పు అని అడిగాడు. నారాయణ కట్టడాల కూల్చివేత గురించి చెప్పాడు. దీనికంత మోహమాటం ఎందుకు నారాయణ... నువ్వు ఒక్క మాట చెప్పు అక్రమ కట్టడాల కూల్చివేతకు గడ్డపార పట్టుకుని నేనే బయలుదేరుతా... అని వివేకా చెప్పాడు. ఆ మాటలతో నారాయణకు ఎనలేని ధైర్యం వచ్చింది. రేపట్నుండే కూల్చివేతలు ప్రారంభించండని టౌన్‌ప్లానింగ్ డైరక్టర్ రఘును ఆదేశించి నారాయణ విజయవాడకు బయల్దేరడానికి లేచాడు.

★ ★ ★ ★ ★

విజయవాడలో సీఎం క్యాంప్ కార్యాలయం. చంద్రబాబు, మంత్రులు కూర్చుని వున్నారు. నారాయణ సీరియస్‌గా వెళ్లి చంద్రబాబుతో టీవీ ఆన్ చేయండి సార్, అని అడిగాడు. ఏమైంది నారాయణ... అంత సీరియస్‌గా వున్నావని అడిగాడు చంద్రబాబు. అందుకు నారాయణ... నేనెందుకూ పనికిరాని సన్యాసినని, పనితీరులో చివరి ర్యాంకు ఇచ్చారు కదా, నా పనితీరు ఎలావుందో టీవీలో చూడండి, విజయవాడలో మీరంతా కలిసి చేసిన విధ్వంసం కంటే నెల్లూరులో నేను చేయిస్తున్న విధ్వంసమే ఎక్కువ... అది చూసారంటే వందుకు వంద కాదు వందకు నూటపాతిక మార్కులేస్తారన్నాడు. చంద్రబాబు వెంటనే టీవీ ఆన్ చేసి టివి 9.9=99/999 ఛానెల్ పెట్టాడు.

నెల్లూరు నగరంలో అక్రమ కట్టడాల కూల్చివేత దృశ్యాలొస్తున్నాయి. జనం గుంపులు గుంపులుగా అక్కడ చేరి అధికారులతో గొడవ పడుతున్నారు. కూల్చివేతలను నిరసిస్తూ అన్ని పార్టీల నాయకులు అక్కడ చేరుతున్నారు. అప్పుడే అక్కడకు వచ్చిన సోమిరెడ్డి ముందు టీవీ ఛానెల్స్ వాళ్లు మైకులు పెట్టారు. సోమిరెడ్డి మాట్లాడుతూ... ఈ కూల్చివేతలు దారుణం, ఏకపక్ష నిర్ణయం, మా ముఖ్యమంత్రి ఇలాంటి వాటిని సహించడు... నాలుగు వందల కట్టడాలను కూలిస్తే నాలుగు లక్షల మంది మా పార్టీకి వ్యతిరేకం అవుతారన్న విషయం మా నారాయణకు తెలియదు. ఇటువంటి మిడిమిడి జ్ఞానం ఉన్నోళ్లు మంత్రులైతే పరిణామాలు ఇలానే ఉంటాయని చెప్పాడు. అక్కడే వున్న ఆదాల... టీవీ ఛానెల్స్‌తో మాట్లాడుతూ... నారాయణ నగరాభివృద్ధి చర్యలు తీసుకుంటే మేం అండగా నిలుస్తామని చెప్పాం, కాని ఆయన అభివృద్ధికి కాకుండా ఇలాంటి విధ్వంసాలకు పూనుకుంటాడని వూహించలేకపోయాం, ఈ సంఘటనలను మేం వెంటనే చంద్రబాబు దృష్టికి తీసుకెళతాం అని చెప్పాడు. అప్పుడే అక్కడకు వివేకా వచ్చాడు. ఆయనను చూడగానే ఆడ, మగ, పిల్ల, ముసలి బాధితులందరూ చుట్టుముట్టి... చూడు నాయనా, మాకు ఎంత అన్యాయం చేసారో అని ఏడుస్తుంటే, వివేకా కళ్లద్దాలు తీసి ఏడుస్తూ... ఏం చేసేదక్కా... ప్రజలతో సంబంధాలు లేనివాళ్లు మంత్రులైతే ఇలాగే ఉంటుందక్కా... అని అంటుండగా, గుంపులోనే ఇంకో బాధితుడు... నిజంగా నువ్వు దేవుడివయ్యా, నీ హయాంలో ఎన్ని అక్రమ భవనాలు కట్టుకోలేదు, ఒక్కటన్నా కూల్చారా... నీలాంటోళ్లే ప్రజలకు కావాలయ్యా... నువ్వు దేవుడివయ్యా... అని వివేకా చేతులు పట్టుకుని ఏడవసాగాడు.

టీవీలో ఆ సీన్‌లన్నీ చూసిన నారాయణకు తల తిరగసాగింది. చంద్రబాబు నవ్వుతూ నారాయణతో... వ్యాపారమే కాదు, రాజకీయాలు కూడా కాస్త వంటబట్టించుకో, ఇప్పుడు చెప్పు నూటికి ఎన్ని మార్కులు వేయమంటావ్ అంటూ లేచాడు.



## కావలి కబుర్లు

# నలందలో హరితహారం


యస్దానిబాషా ఆధ్వర్యంలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

'మొక్కలు నాటండి–పర్యావరణాన్ని కాపాడండి' అనే నినాదంతో పట్టణంలోని గాయత్రి నగర్‌లో వున్న నలంద ఇంగ్లీషు మీడియం హైస్కూల్ ఆవరణంలో హరితహారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఉప విద్యాశాఖాధికారి యస్దానీబాష ముఖ్య అతిథిగా వ్యవహరించి పాఠశాల ఆవరణంలో చిన్నారులచేత మొక్కలు నాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితులలో పర్యావరణ పరిరక్షణ ఎంతో అవసరమని, రోజు రోజుకు చెట్లు నరికివేయడం వల్ల పర్యావరణంలో అసమతుల్యం, కాలుష్యం ఎక్కువై సకాలంలో వర్షాలు కురవక రైతులు, ప్రజలు ఎన్నో ఇబ్బందులకు గరౌతున్నారని, రాబోవు తరాల వారికి ఇలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉండాలంటే నేటి బాలలే రేపటి పౌరులైన నలంద విద్యార్థులచే ఈ హరిత హారం నిర్వహించడం జరిగిందన్నారు. దీనివల్ల పాఠశాలలోనే కాకుండా చుట్టు ప్రక్కల వాతావరణాన్ని కూడా పరిరక్షించి చిన్నారులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. చిన్నారులచేత ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ యం.డి.మజహర్ మాట్లాడుతూ.. నేడు ప్రపంచం సాంకేతిక రంగంలో ఎంతో అభివృద్ధి చెందినా పర్యావరణ పరిరక్షణలో మాత్రం వెనకడుగులో ఉందని, దానిని అధిగమించడానికి మా పాఠశాల చిన్నారులచే ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని, పాఠశాలలో పర్యావరణ పరిరక్షణకు సహకరించిన తుమ్మలపెంట అటవీశాఖ అధికారికి ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు వారి చిన్నారులకు తమ ఇళ్ల పరి సరాలలో మొక్కలునాటడంలో అవగాహన కల్పించి వారికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నలంద విద్యాసంస్థల డైరక్టర్ ఎమ్.డి.వశీం, పాఠశాల ప్రిన్సిపాల్ ఏ.రమేష్‌రెడ్డి, పాఠశాల సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# క్షేత్ర స్థాయిలోకి సంక్షేమ పథకాలు


సమావేశంలో పాల్గొన్న నాయకులు

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకుపోయి ప్రజలకు అర్థమయ్యేలా వివరించేందుకు ప్రతిఒక్కరూ.. కృషిచేయాలని పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు ఏగూరు చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సభ్యులందరూ నిర్ణయించారు. ఆదివారం తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో ఎస్సీసెల్ కార్యవర్గసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షులు డా॥ సునీల్, ప్రధానకార్యదర్శి దారా విజయబాబు, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మలిశెట్టి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి అమరా యాదగిరిగుప్తా, టీడీపీ లీగల్‌సెల్ అధ్యక్షులు పోట్లూరి శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా విచ్చేసి మాట్లాడుతూ తెలుగుదేశం అనుబంధ సంఘాల సమావేశమైన ఎస్సీసెల్ సమావేశం మొట్టమొదటిగా నిర్వహించుకోవడం శుభపరిణామమన్నారు. పట్టణంలో 40వార్డులలో 6ఎస్సీ వార్డులని, ఈ వార్డులు గత ప్రభుత్వాలలో ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలో వాటి అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు అందచేయాలని అన్నారు. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మరుగుదొడ్లు వినియోగించాలని, ఇంకుడు గుంటలపై అవగాహన కల్పించాలని, విరివిగా మొక్కలు నాటాలని స్మార్ట్ సర్వేపై ప్రజలకు అవగాహన కల్పించాలని తీర్మానించారు. ఈ సందర్భంగా సీనియర్ ఎస్సీసెల్ నాయకులైన అక్కిలిగుంట సూర్యప్రకాష్, దారా మల్లికార్జున్‌లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సూర్యప్రకాష్, మధు, శ్యాంసన్, ఏసురత్నం, జగదీష్, శ్రీకాంత్, కిరణ్, మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

# చదువుతోనే బంగారు భవిత

**- డాక్టర్ లక్ష్మీనరసారెడ్డి**


పేద విద్యార్థులకు డా॥ సి.యల్.యన్ ట్రస్ట్ కిట్స్

విద్యార్థులు బాగా చదివి మంచిమార్కులతో ఉత్తీర్ణులు కావాలని డా॥ సి.యల్.యన్–సుజనమ్మ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు డా॥ లక్ష్మీనరసారెడ్డి అన్నారు. పట్టణంలోని పాతవూరు మున్సిపల్ హైస్కూల్‌నందు హెడ్ మాస్టర్ జాఫర్ ఖాన్ అధ్యక్షతన విద్యార్థులకు యూనిఫాం, నోటుపుస్తకాలు, స్కూల్‌బ్యాగ్స్, జామెంట్రీ బాక్సులు, డిక్షనరీతో పాటు నగదు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డా॥ లక్ష్మీనరసారెడ్డి కుమార్తె డా॥ సుభాషిణి, రోటరీ క్లబ్ అధ్యక్షులు డా॥ మాధవరెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా॥ సి.ఎల్. ఎన్.రెడ్డి మాట్లాడుతూ... ట్రస్ట్ ద్వారా ఎన్నుకోబడిన విద్యార్థులు వరుసగా మొదటి ర్యాంకులు సాదిస్తే వారు ఎంత వరకు చదివినా అంత వరకు ఈ ట్రస్ట్ చదివిస్తుందని అన్నారు. డా॥ సీ.ఎల్.ఎన్ రెడ్డి–సుజనమ్మ చారిటబుల్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో గత తొమ్మిది సంవత్సరాలుగా పట్టణంలోని మున్సిపల్ పాఠశాలలోని 8, 9, 10వ తరగతులలో నిజమైన పేద విద్యార్థులు ఒక్కో తరగతికి నలుగురుని ఎన్నుకుని వారికి అవసర మైన స్టడీ మెటీరియల్‌తో పాటు యూనిఫాం, నోటుపుస్తకాలు పంపిణీ చేస్తున్నామన్నారు. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకుని తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు కన్వీనర్ అనుమాలశెట్టి రామకృష్ణ, సంజీవ రెడ్డి, పాఠశాల హెచ్ఎమ్ సుబ్బారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మన అప్రమత్తతోనే పార్కిన్సన్స్ వ్యాధికి కళ్లెం

Apollo SPECIALITY HOSPITALS
TOUCHING LIVES

### పార్కిన్సన్స్ వ్యాధి అంటే ఏమిటి?

పార్కిన్సన్స్ అనేది నెమ్మదిగా వ్యాపిస్తూ, జీవగతిని మార్చి వేస్తుందే కాని ప్రాణానికి ప్రమాదం కలిగించే వ్యాధి కాదు. మన శరీరంలోని సకల క్రియలనూ మెదడు నియంత్రిస్తూ వుంటుంది. ఈ ప్రక్రియోల నాడీవ్యవస్థ ద్వారా శరీరానికి మెదడు సూచనలను అందజేస్తూ వుంటుంది. ఈ సూచనలు న్యూరోట్రాన్స్ మిట్టర్స్ అనే రసాయనాల ద్వారా సూచించబడుతుంటుంది. పార్కిన్సన్స్ ఈ సూచనలు దెబ్బతినడం వల్ల జరుగుతుంది.

సాధారణ ప్రక్రియలో, న్యూరాన్లు డోపమైన్ అనే రసాయనాన్ని మెదడులో తయారు చేస్తుంది. ఈ రసాయనం మెదడులో సమాచార వ్యవస్థను ఏర్పరచి, సబ్‌స్టాంట్షి యానిగ్రా మరియు ఇతర మెదడు భాగాలకు సమాచారాన్ని చేరవేస్తుంటాయి. సున్నితమైన కండర వ్యవస్థ సమతుల్యతతో ఈ సమాచార వ్యవస్థ పనిచేస్తుంటుంది. ఈ డోపమైన్ లోపం వల్ల నాడులలో అసాధారణ ప్రవర్తన ఏర్పడుతుంది. దీనివల్ల శరీర కదలికల వేగం తగ్గుతుంది.

### పార్కిన్సన్స్ వ్యాధి బారిన పడేవారెవరు?

పార్కిన్సన్స్ వ్యాధి ప్రపంచమంతా విస్తరించి వుంది. అన్ని జాతులు మరియు తెగల మధ్య ఇది ప్రపంచ వ్యాప్తంగా 6.3 మిలియన్ల మందిలో ఏర్పడి వుంది.

మహిళల్లో కంటే పురుషుల్లో ఈ వ్యాధి ఎక్కువగా ఏర్పడుతుంది. 60 సం॥ల వయస్సు దాటిన మగ వారిలో ఈ వ్యాధి ఏర్పడే అవకాశం వుంది. అయితే పార్కిన్సన్స్ వ్యాధి మధ్యవయస్సు వారిలో కూడా ఏర్పడే అవకాశం వుంటుంది. జనాభాలో షుమారుగా 1% మంది 60సం॥ల వయసు దాటినవారు ఈ వ్యాధి బారిన పడుతుంటే, 4% మంది 80సం॥ల వయసు దాటిన వారిలో పార్కిన్సన్స్ వ్యాధి కలిగే అవకాశం వుంది. అయితే 50సం॥లు దాటిన వారిలో కూడా ఈ వ్యాధి ఏర్పడే అవకాశం వున్నా, 21–40సం॥ల మధ్య వయసు వారిలో ఇది తక్కువగా కనబడుతుంటుంది.

### పార్కిన్సన్స్ వ్యాధి లక్షణాలేమిటి?

- కండరాలు బిగుతుగా పట్టివేయడం
- వణకడం
- బ్రేడికైనేసియా (చలన వేగం తగ్గడం, క్రమంగా రోజువారి కార్యక్రమాలు నెమ్మదిగా చేయడం)
- నడకలోను, భంగిమలలోను తేడా ఏర్పడడం
- మాటలోను, చేతిరాతలోను మార్పు రావడం
- తరచూ నియంత్రణ కోల్పోయి ప్రక్కకు వాలి పోవడం, పడిపోవడం
- ఆర్థోస్టాటిక్ హైపోటెన్షన్(నిలబడినప్పుడు బి.పి. తగ్గి, కళ్ళు తిరిగి పడిపోవడం)

ఇంకా సాధారణంగా నొప్పిగా వుండడం, మతి మరుపు, అలసటగా వుండడం, నిద్రలో ఇబ్బంది, నిస్పృహ, అజీర్ణం, గుర్తించడంలో యిబ్బంది, భయం మరియు ఆత్రుత మరియు మూత్ర విసర్జన సమస్యలు వంటివి ఏర్పడతాయి. ఈ ఇబ్బందులు వ్యక్తిని బట్టి మారుతుంటాయి.

### పార్కిన్సన్స్ వ్యాధికి కారణాలేమిటి?

ఈ వ్యాధికి కారణాలు కనుక్కోవడం ఇంకా అధ్యయన దశలోనే వున్నాయి. చాలావరకు ఇది సంక్రమణ వ్యాధి కాదు.

వాతావరణంలోని కొన్ని టాక్సిన్ల కారణంగా ఈ వ్యాధి ఏర్పడవచ్చు. ఉదా– బొగ్గు గనుల్లో మాంగనీస్, ఎరువులు పురుగుమందులు వంటివి, తలకు దెబ్బ తగలడం వంటి కారణాలు చెప్పుకోతగ్గవి. మెదడు దీర్ఘకాల ఇబ్బందులకు గురికావడం పార్కిన్సన్స్ వ్యాధి లక్షణం. ఇప్పటివరకు జరిగిన అధ్యయనాలు దీనికి నివారణ మార్గాలను కనుక్కోలేక పోయాయి.

### పార్కిన్సన్స్ వ్యాధి బారిన పడినవారిని ఎలా సరిచేయాలి?

పార్కిన్సన్స్ వ్యాధి వల్ల మీరు బాధపడుతున్నట్టు గుర్తించి వెంటనే ఇతరుల సహాయం తీసుకోవడం మంచిది. మీకు ఏర్పడుతున్న లక్షణాలను మీరు గుర్తించినట్లయితే, త్వరగా దానికి నివారణ మార్గాలను తెలుసుకొని అనుసరించాలి.

మీ పట్టణంలో మీకు సహాయంగా వుండగల మద్దతుదారుల (సపోర్ట్ గ్రూప్) సహాయం తీసుకోవాలి.

మీ జీవితం మీద మీకు నియంత్రణ ఏర్పడేలాగా సహాయం చేసి, మీ జీవన ప్రమాణాన్ని మెరుగుపరచే అవకాశాలున్నాయి.

**ఇంకా క్రింది విధంగా మీరు చర్యలు తీసుకోవచ్చు.**

- ఈ వ్యాధి గురించి మీరు చక్కగా తెలుసుకోవడం.
- మీ స్నేహితులు మరియు కుటుంబ సభ్యులతో ఈ వ్యాధి గురించి చర్చించడం చేయవచ్చు.
- మీకు సహాయం చేయడంలో వారి సహకారం తీసుకోవచ్చు.
- మీకు ఇష్టమైన పనులు చేయాలి.
- అందుబాటులో వున్న వనరులను ఉపయోగించుకొని, మీ పొరుగున వున్న మద్దతుదారుల(సపోర్ట్ గ్రూప్) సహాయం తీసుకోవడం మంచిది.
- ఒత్తిడిని ఎదుర్కోవడం నేర్చుకోవాలి. దీనివల్ల మీరు శారీరకంగా నియంత్రణ కలిగి వుండవచ్చు. ఉద్రిక్త పరిస్థితులను దూరంగా వుంచండి. ఆధ్యాత్మిక భావాలను ఏర్పరచుకోవాలి. ఒత్తిడికి గురికాకుండా వుండడమే ఈ వ్యాధి బారిన పడకుండా వుండేందుకు ఉత్తమమైన మార్గం.

### పార్కిన్సన్స్ వ్యాధికి నివారణ వుందా?

పార్కిన్సన్స్ వ్యాధి నివారణకు ఇప్పటివరకు జరిగిన అధ్యయనాల వల్ల ఎటువంటి నివారణో పాయాలు కనుగొనబడలేదు. అయినప్పటికీ అధ్యయనం కొనసాగుతూనే వుంది.

పార్కిన్సన్స్ వ్యాధికి నివారణ లేకపోయినప్పటికీ, వ్యక్తిగత లక్షణాలను పరిశీలించి, వ్యాధి నివారణ మార్గాలను గ్రహించుకొని, నివారణ పొంది సుఖంగా వుండవచ్చు. జీవితాన్ని సరిచేసుకోవచ్చు. ఈ వ్యాధి గ్రస్తులు న్యూరాలజిస్టును సంప్రదించి, వారి లక్షణాలను బట్టి మందుల మోతాదులను సరి చూసుకోవలసి వస్తుంది. దాదాపు చాలామంది పేషంట్లు, మందుల సహకారంతోనే తమ రోజు వారి పనులను చేసుకో గలుగుతుంటారు. డోపమైన్ రసాయన వ్యవస్థ నిర్వహణ తీరును మెరుగుపరచడం ఇందులో ముఖ్యమైనది.

పార్కిన్సన్స్ వ్యాధి ఏర్పడిన తర్వాత నివారణకు వివిధ వైద్య పద్ధతులు అందుబాటులో వున్నాయి.

డిబిఎస్ చికిత్సలో న్యూరోసర్జన్లు న్యూరోస్టిమ్యు లేటర్ అనే పరికరం ద్వారా తాకించడం ద్వారా ట్రీట్‌మెంటు నిర్వహిస్తారు.

### సపోర్ట్ గ్రూప్ అంటే ఏమిటి?

పార్కిన్సన్స్ వ్యాధి లక్షణాల గురించి అవగాహన కలిగివుండి, ఆయా లక్షణాల నివారణకు మార్గాలు తెలిసిన వారిని సపోర్ట్ గ్రూప్ అంటారు. వీరంతా ఒక చోట కలిసి, పార్కిన్సన్స్ వ్యాధికి మద్దతుదారుల బృంద సభ్యులుగా ఏర్పడి, ఈ వ్యాధిగ్రస్తులకు తమ మద్దతు అందించడం ద్వారా సేవలందిస్తారు.

ఈ బృందంలో, ఎవరో ఒకరు పార్కిన్సన్ వ్యాధిపై అవగాహన వుండి, చికిత్స పద్ధతులు గ్రహించిన వారుగా వుంటారు. ఏమైనప్పటికీ, బృందసభ్యులు తమ అనుభవాలను పునశ్చరణ చేసుకొని, పార్కిన్సన్స్ వ్యాధిగ్రస్తుల వ్యవహార శైలిని పరిశీలించి, తగు జాగ్రత్తలు సూచిస్తారు. దీని గురించి చర్చించడం, ఉపన్యాసాలివ్వడం వంటి పలు విధానాల ద్వారా జాగ్రత్తలపై అవగాహన కల్పించబడుతున్నది.

ఈ మద్దతుదారుల బృందం (సపోర్ట్ గ్రూప్) నెలకు ఒకటి, రెండుసార్లు సమావేశమై, వైద్య విధానాలను గురించి పరస్పరం తెలుసుకొని, అవగాహన చేసుకోవాల్సి వుంది.



**Prof (Dr.) Bindu Menon,**
M.D.(Med.),D.M.(Neuro),
DNB.(Neuro),PGDCN (Neuro),
(London),FRCP (Edinburgh)
**Prof and HOD Neurology,**
**Apollo Speciality Hospitals, Nellore**
President, Epilepsy association,
Nellore chapter.

# వ్యాపారుల సమస్యలు తీరుస్తా!

- ఎమ్మెల్సీ సోమిరెడ్డి

వ్యాపారుల న్యాయమైన సమస్యల సాధనకు కృషిచేస్తామని, సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి వ్యాపారులకు తగు న్యాయం చేస్తామని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఈ నెల 17న నెల్లూరు పప్పులవీధిలో వున్న కళ్యాణమండపంలో ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర పాలనలో మంచి మార్పులు తెస్తున్నారని ఆయన కొనియాడారు. పారదర్శకమైన పాలన కోసం ఆన్‌లైన్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ బీద రవిచంద్ర మాట్లాడుతూ, రాష్ట్ర రెవెన్యూను పెంచేందుకు ప్రభుత్వం అన్ని విధాలైన చర్యలు తీసుకుంటోందన్నారు. నెల్లూరు మేయర్ అబ్దుల్ అజీజ్, టిడిపి నాయకుడు ఆదాల ప్రభాకరరెడ్డి, రాష్ట్ర చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ముఖ్య అతిథులను వ్యాపారులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, మంచికంటి శ్రీనివాసులు పాల్గొన్నారు.



## సుజాత నేత్రదానం

సంతపేట యనమలవారివీధి వాస్తవ్యురాలు తటవర్తి సుజాత (57) పరమపదించగా, కుటుంబసభ్యుల కోరిక మేరకు బుధవారం లయన్స్‌క్లబ్ ఆఫ్ నెల్లూరు-పినాకిని, అర్బన్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఐ బ్యాంక్ టెక్నీషియన్ ఎండిబి ప్రసాద్ ఆమె నేత్రాలను సేకరించారు. ఈ సందర్భంగా నేత్రదాన మోటివేటర్ బయ్యా ప్రసాద్ మాట్లాడుతూ నేత్రదాత కుమారులు టివి కృష్ణారావు, టి.వసంతకుమార్‌ల సేవాస్ఫూర్తిని అభినందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పి.సీతా రామారావు, అయితా భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# మేయర్ C/o డి.ఆర్

(మొదటి పేజీ తరువాయి)

ప్రచారమైపోయింది. ఇక కార్పొరేషన్‌లోని నాలుగు ప్రధాన విభాగాధిపతులకు కూడా మేయర్, షాడో మేయర్‌లు టార్గెట్‌లు విధించారు. ఈ టార్గెట్‌లు ఇంతమేరకు పన్నులు వసూలు చేయాలనో, ఇన్ని పార్కులు బాగుచేయాలనో, ఇన్ని మురుగుదొడ్లు కట్టాలనో కాదు... తమకు నెలకు ఇంత కలెక్షన్ తెచ్చివ్వాలని! ఇందులో టౌన్‌ప్లానింగ్ విభాగానికి ఎక్కువ వాటా కేటాయించారు. నెలకు 50లక్షలు తక్కువ కాకుండా తెచ్చివ్వాలని టౌన్ ప్లానింగ్ విభాగానికి టార్గెట్ పెట్టారు. అలా ఇస్తామని గ్యారంటీ ఇచ్చిన వారినే ఆ విభాగానికి తెచ్చుకున్నారు. అలా తేలేనని చెప్పే గతంలో సిపిఓగా వున్న శ్రీనివాసరావు ఇక్కడ నుండి బదిలీ అయిపోయాడని సమాచారం. మేయర్, షాడోమేయర్‌ల పుణ్యాన గతంలో ఓ కేసు నుండి బయటపడ్డ వైద్యఆరోగ్య విభాగం అధికారికి కూడా నెలకు టార్గెట్ వున్నట్లు తెలుస్తోంది. అతను నెలనెల టార్గెట్‌ను భర్తీ చేయడం కోసం కార్పొరేషన్‌లో దొంగబిల్లులు సృష్టించడమే కాక, తనకొచ్చే లంచాలను కూడా ఈ టార్గెట్‌ను భర్తీ చేయడం కోసమే ఉపయోగిస్తూ తన నోటిని కట్టేసుకుంటున్నట్లు సమాచారం. పాలకుల అవినీతిని తట్టుకోలేక అధికారులు సైతం నెల్లూరు కార్పొరేషన్‌కు రావడానికి భయపడుతున్నారు.

## కాలధర్మం

# సుంకర చెన్నయ్య



'మానవ కళ్యాణం' పత్రిక వ్యవస్థాపకునిగా, సీనియర్ పాత్రికేయునిగా అందరికీ సుపరిచితుడైన సుంకర చెన్నయ్య(81) గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఈ నెల 19న కన్నుమూశారు. సౌమ్యుడు, నెమ్మదస్తుడైన చెన్నయ్య మృతి అందరినీ కలచివేసింది. నెల్లూరు మునిసిపాలిటీగా మారిన తర్వాత నెల్లూరు నగరంలోని వెంకటేశ్వరపురానికి చెన్నయ్యే తొలి కౌన్సిలర్ కూడా. అలా ఆయన నెల్లూరులో తొలివార్డు (1వ వార్డు)కు తొలి కౌన్సిలర్ అయ్యారు. 1981లో కౌన్సిలర్‌గా గెలుపొందిన చెన్నయ్య వెంకటేశ్వరపురం ప్రాంతంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారు. ప్రాథమికోన్నత పాఠశాల, వాటర్‌ట్యాంక్ నిర్మాణం, అన్ని వీధులకు విద్యుత్ వెలుగులు, గాంధీ గిరిజనకాలనీలో పేదలకు ఇళ్ళ నిర్మాణం వంటివన్నీ ఆయన హయాంలో వచ్చినవేనని ప్రజలు ఇప్పటికీ గుర్తుచేసుకుంటుంటారు. అంతేకాదు, వెంకటేశ్వరపురం నడిబొడ్డులో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం కూడా ఆయన కృషి ఫలితమే. నేటికీ ఈ ఆలయం నిత్య పూజలతో అలరారుతోంది. చెన్నయ్య స్వస్థలం విడవలూరు మండలంలోని దంపూరు గ్రామం. ఇటు పత్రికా రంగంలోనూ.. అటు ప్రజాసేవా రంగంలోనూ చేసిన విశిష్ట సేవలకు పలు అవార్డులు లభించాయి. ఆయనకు భార్య హైమావతి, అయిదుగురు సంతానం వున్నారు. పెద్దకుమారుడు హైకోర్టు న్యాయవాదిగా, రెండవ కుమారుడు పాత్రికేయునిగా వున్నారు. చెన్నయ్య మరణం ఆయన కుటుంబసభ్యులకే కాక, వెంకటేశ్వరపురం ప్రజలకి కూడా తీరని లోటు. చెన్నయ్య మృతికి విచారం వ్యక్తం చేస్తూ, ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తోంది 'లాయర్'.

# గుండెల్లో గునపాలు

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ ప్రభుత్వంలో మున్సిపల్ మంత్రిగా నెల్లూరుజిల్లాకు చెందిన ఆనం రామనారాయణరెడ్డి ఉన్నప్పుడు జిల్లాలో పంచాయితీలుగా వున్న ఆత్మకూరు, సూళ్లూరుపేటలను మున్సిపాల్టీలుగా మార్చాడు. జిల్లాలోని మున్సిపాల్టీలలో అభివృద్ధి పనులకు అదనపు నిధులు తెచ్చాడు. ఒక మంత్రి చేయాల్సింది ఇది.

ఇప్పుడు ఇదే జిల్లాకు చెందిన పి.నారాయణ మున్సిపల్ మంత్రిగా ఉన్నాడు. ఆయన ఏం చేసాడని ప్రశ్నిస్తున్న వారికి గుండెల్లో గునపాలు దిగే సమాధానం చెప్పాడాయన. మున్సిపల్ మంత్రియ్యి రెండున్నరేళ్ల కావస్తున్నా ఈ జిల్లాకు నిధులు తేలేదు, అభివృద్ధి పనులు తేలేదు... కాని, నెల్లూరు నగరంలో పాలకులకు, అధికారులకు లంచాలిచ్చి మున్సిపల్ అప్రూవల్స్‌ను అధిగమించి కట్టిన భవనాలను కూలగొట్టడానికి మాత్రం ప్రొక్లెయిన్‌లు తెప్పించాడు. నగరంలో టౌన్‌ప్లానింగ్ సిబ్బంది 300 అక్రమ కట్టడాలను గుర్తించగా, వాటిలో స్క్రీనింగ్ జరిపి మొదటి వరుసలో 50కట్టడాలను పెట్టారు. ఈ నెల 17, 18, 19తేదీలలో ప్రొక్లెయిన్‌లు, గడ్డపారలు తీసుకుని వాటి మీద పడ్డారు. కొన్ని భవనాలను కూల్చేసారు. బాధితులు క్రిందా మీద పడ్డా, కాళ్ళా వేళ్ళా పడ్డా, కన్నీళ్ళతో వేడుకున్నా ఆందోళనలతో అడ్డుకున్నా... ఏ మాత్రం వెనక్కి తగ్గకుండా మండపాలవీధి, శెట్టి గుంటరోడ్డు, బి.వి.నగర్ వంటి కొన్ని ప్రాంతాల్లో అక్రమ కట్టడాలను కూల్చేశారు.

## రాజకీయ వ్యతిరేకత

ఉన్నఫళంగా అక్రమ కట్టడాల పేరుతో భవనాలను కూల్చడాన్ని ప్రధాన ప్రతిపక్షంగా వైకాపా తీవ్రంగా వ్యతిరేకించింది. కార్పొరేషన్‌లో వైకాపా ప్రతినిధులు డిప్యూటీ మేయర్ యం.ద్వారకానాథ్, ఫ్లోర్‌లీడర్ పి.రూప్‌కుమార్‌యాదవ్, విప్ బొబ్బల శ్రీనివాసయాదవ్, ఇతర కార్పొరేటర్లు దీనికి వ్యతిరేకంగా గట్టిగా పోరాడారు. ఇక తెలుగుదేశం నాయకులు కూడా దీనిని బలంగా వ్యతిరేకించారు. ఇలా అడ్డదిడ్డంగా కూలగొడితే వచ్చే ఎన్నికల్లో ప్రజల్లోకి వెళ్లలేమని టిడిపి కార్పొరేటర్లు బాహాటంగానే తమ బాధను వెళ్లగక్కారు. తెలుగుదేశంపార్టీ నెల్లూరు రూరల్ ఇన్‌ఛార్జ్ ఆదాల ప్రభాకరరెడ్డి అయితే భవనాల విధ్వంసంపై నిప్పులు కక్కారు. నేరుగా మంత్రి నారాయణ మీదనే విమర్శలు ఎక్కుపెట్టాడు. ఆదాల విమర్శల ధాటితో పార్టీ అధిష్ఠానంలో కలకలం రేగింది.

## ఇంత సీన్ ఎందుకు?

మున్సిపల్ మంత్రిగా నారాయణ ఏమీ చేయడం లేదన్న విమర్శలున్నాయి. అదీ గాక ఇటీవల కాలంలో నెల్లూరు నగర పాలక సంస్థ అవినీతికి నిలయంగా, కలెక్షన్‌ల కేంద్రంగా మారిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కార్పొరేషన్ సిబ్బంది అవినీతికి సాక్ష్యమన్నట్లు ఈ ఏడాదిలోనే లంచం తీసుకుంటూ అసిస్టెంట్ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ ఏసిబికి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. అలాగే బిల్డింగ్ సూపర్‌వైజర్ కృష్ణయ్య ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏసిబికి చిక్కాడు. ఇంకా పలు అవినీతి ఆరోపణలున్నాయి. ఇక టౌన్ ప్లానింగ్ విభాగంలో అవినీతి మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతుందన్నది నగ్నసత్యం. భవన యజమానుల నుండి కలెక్షన్‌లు దండుకుంటూ అక్రమ నిర్మాణాలకు టౌన్‌ప్లానింగ్ సిబ్బంది సహకరిస్తున్నారు. నెల్లూరు కార్పొరేషన్ అవినీతి జమానాగా, అక్రమాల ఖజానాగా మారడంతో, సొంత కార్పొరేషన్ సరిదిద్దుకోలేని వాడివి ఇక మున్సిపల్ మంత్రిగా ఏం పీకుతావన్న సూటిపోటి మాటలు నారాయణకు సూటిగానే తగులుతున్నాయి.

ప్రొక్లెయిన్‌లు, గడ్డపారలు తీసుకుని టౌన్‌ప్లానింగ్ సిబ్బంది బయలుదేరుతుంటే భవన యజమానుల గుండెల్లో విమానాలు పరుగెత్తాయి. తమ కట్టడాల జోలికి రాకుండా చేసుకునేందుకు ఎవరి పాట్లు వాళ్ళు పడ్డారు. ఆ మూడురోజులు వాళ్ళు నిద్రలేని రాత్రులే గడిపారు.

## రాజకీయ వివాదాలు

నెల్లూరు కార్పొరేషన్‌లో నెలకొన్న వివాదాలు సైతం భవనాల విధ్వంసానికి దారి తీసాయని చెప్పవచ్చు. మేయర్‌తో ఆనం వివేకాకు పడదు. ఆదాలకు గిట్టదు. సోమిరెడ్డికి దూరం. సొంత పార్టీ కార్పొరేటర్లే మేయర్‌కు వ్యతిరేకం. ఈమధ్య ఆనం, అజీజ్‌లు పరస్పర దూషణలతో రోడ్డెక్కారు. పంచాయితీ చంద్రబాబు దాకా పోయింది. అక్కడా నారాయణకు చీవాట్లే... ఈ గొడవల నుండి అందరి దృష్టిని మళ్ళించేందుకే నారాయణ ఈ విధ్వంస రచనకు పూనుకున్నాడని టాక్.

నారాయణ నెల్లూరుకు ఏమీ చేయలేదు... అని అంటుంటే ఉన్నట్లుండీ పెద్ద సంచలనమే రేపాడు. ఎవరు ఊహించని విధంగా అక్రమ కట్టడాల విధ్వంసానికి పచ్చజెండా ఊపి ఇటు తెలుగుదేశం నాయకులు, అటు భవన యజమానులకు కంటి మీద కునుకు లేకుండా చేశాడు. మూడురోజులకే నారాయణ వేసిన సెల్ఫ్ గోల్‌కు నెల్లూరు నగర తెలుగుదేశం నాయకులు అతలాకుతలమయ్యారు. నగరంలో ఈ విధ్వంసం ఇంకో వారం కొనసాగి వుంటే తెలుగుదేశం నాయకులు నెల్లూరు వీధుల్లో తిరిగే పరిస్థితి కూడా ఉండేది కాదు. మొత్తం మీద మంత్రిగా నారాయణ తన పవర్‌ను అభివృద్ధి పనుల్లో చూపక పోయినా ఇలా చూపించి హడలెత్తించాడు.

## ఒత్తిళ్ళతో తగ్గిన కూల్చివేత

నలువైపుల నుండి రాజకీయ ఒత్తిళ్ళు రావడంతో మంత్రి నారాయణ దిగి రాక తప్పలేదు. నగరంలో కట్టడాల కూల్చివేతను ఆపాలంటూ టౌన్‌ప్లానింగ్ డైరెక్టర్ రఘుకు ఆదేశాలొచ్చాయి. దాంతో ఆయన ఈ తొక్కలో పంచాయితీకి ఇంత హంగామా ఎందుకన్నట్లు మూటాముల్లె సర్దేశారు. చివరకు అక్రమ కట్టడాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం నెలరోజుల గడువు ఇచ్చింది. దీంతో భవన యజమానులకు పోయిన ఊపిరి తిరిగి వచ్చినట్లయ్యింది.

# కాంగ్రెస్... పాప ప్రక్షాళన?

(మొదటి పేజీ తరువాయి)

విభజన బిల్లులో ఆ అంశం లేదు కాబట్టి ఏపికి ప్రత్యేకహోదా ఇవ్వలేమంటున్నది కూడా వీళ్లే! ఏపి పట్ల కాంగ్రెస్ చేసిన పాపానికి శిక్ష పడింది. ఈ రాష్ట్రంలో ఆ పార్టీ నామరూపాలు లేకుండా పోవడమే కాదు, అధికారంలోకి వస్తామని ఆశలు పెట్టుకున్న తెలంగాణలోనూ చుక్కెదురైంది. ఏపికి చాలా అన్యాయం చేసామన్న పశ్చాత్తాపం ఇటీవల ఢిల్లీ కాంగ్రెస్ నేతల మాటల్లో వ్యక్తమవుతోంది. విభజన బిల్లును ఏకపక్షంగా తయారుచేసామనే విషయం అప్పుడు వారికి తెలుసు, రాజకీయ ప్రయోజనాల కోసం ఆరోజు బిల్లును గుడ్డిగా ప్రవేశపెట్టారు. ఈరోజు ఆ తప్పును ఒప్పుకుంటున్నారు. తమ తప్పును సరిదిద్దుకునే ప్రయత్నంలోనే ఏపికి ప్రత్యేక హోదా కల్పించాలని కోరుతూ పార్లమెంట్‌లో ప్రైవేట్ బిల్లు ప్రవేశపెట్టడానికి సిద్ధపడ్డారు. రాజ్యసభ సభ్యులు కె.వి.పి. రామచంద్రరావు ఈ బిల్లుకు రూపకల్పన చేసి సోనియాని ఒప్పించాడు. అంతేకాదు, ఎన్డీఏ ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న జిఎస్‌టి బిల్లుకు దీనికి ముడిపెట్టారు. జిఎస్‌టి బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందినా ఎన్డీఏకు తగినంత మెజార్టీ లేని కారణంగా రాజ్యసభలో ఆమోదం పొందడం లేదు. రాజ్యసభలో ఆమోదం పొందాలంటే కాంగ్రెస్ మద్దతు తప్పనిసరి. ఈ పరిస్థితిని కాంగ్రెస్ చక్కగా వాడుకుంది. ఏపికి ప్రత్యేకహోదా కోరుతూ పార్లమెంట్‌లోకి ప్రైవేట్ బిల్లు వస్తే కాంగ్రెస్‌తో పాటు ఏపికి చెందిన తెలుగుదేశం, వైకాపాలు మద్దతు తెలపాల్సిందే! కాని ఇక్కడ బీజేపీదే ఇరకాటం పరిస్థితి. మద్దతు తెలిపితే బిల్లు ఆమోదం పొందుతుంది. కాని ఏపికి న్యాయం చేసిన క్రెడిట్ కాంగ్రెస్‌కు పోయి, ఏపి ప్రజల దృష్టిలో బీజేపీ మోసకారిగా మారుతుంది. అలాగని, మద్దతు తెలపకపోతే రాజ్యసభలో జిఎస్‌టి బిల్లుకు కాంగ్రెస్ మోకాలడ్డుతుంది. అదే సమయంలో ఏపిలో బీజేపీ పట్ల అరకొర మిగిలివున్న సానుభూతి కూడా పోతుంది.

కాంగ్రెస్ నాయకులు తమ పాప ప్రక్షాళన కోసం ఓ మంచి ప్రయత్నమే చేస్తున్నారు. ఈ ప్రైవేట్ బిల్లు పార్లమెంటులోకి రాకుండా బీజేపీ అడ్డుకోగలదు. అయితే కాంగ్రెస్ దీని కోసం గట్టిగా పట్టుబడితే మాత్రం బీజేపీకి పెద్ద ఇరకాటమే!

# మంకుపట్టు మంత్రి

(మొదటి పేజీ తరువాయి)

ఎంత నష్టం, స్థానికంగా వుండే తన పార్టీ నాయకులకు ఎంత కష్టం అన్నది ఆయన ఆలోచించలేదు. ఎంతమంది ఉసురు తనకు తగులుతుందనే ఆలోచన ఆయనకు రాలేదు. ఆరునూరైనా అక్రమ కట్టడాలను కూల్చేయాల్సిందేనంటూ తాఖీదు జారీ చేశాడు. నాలుగు ఇళ్ళు కడితే ఓట్లొస్తాయి, నాలుగు ఇళ్ళు కూలగొడితే వచ్చే ఓట్లు పోతాయ్. ప్రజలతో సంబంధాలు లేని వాళ్ళు, ప్రజల ఓట్లతో పనిలేని వాళ్ళు మంత్రులైతే ఇలాంటి నిర్వాకాలే జరుగుతాయంటూ తెలుగు తమ్ముళ్ళు తలలు పట్టుకున్నారు. మొత్తానికి నారాయణ దెబ్బకు అందరూ 'అబ్బా' అని అరవాల్సి వచ్చింది.

# సగం మోడీతో సమానం మన వెంకయ్య

## - మీట్ ది మినిష్టర్ @ చెన్నై కార్యక్రమంలో యస్.పి.బాలు






దేశం కోసం తాను నమ్ముకున్న పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తున్న వెంకయ్యనాయుడు సగం మోడీతో సమానమని, అలాగే ఈ దేశం కోసం దేశ ప్రజల సంక్షేమం కోసం కష్టపడుతున్న మోడీ సగం వెంకయ్యనాయుడుతో సమానమని ప్రముఖ నేపథ్య గాయకుడు యస్.పి.బాలసుబ్రహ్మణ్యం కొనియాడాడు. చెన్నైలోని లీలాప్యాలెస్ హోటల్‌లో 'మీట్ ది మినిష్టర్' పేరుతో 'ది సౌత్ఇండియన్ ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్' జూలై 17వ తేదీ ఆదివారం నాడు ఏర్పాటు చేసిన ఆత్మీయ కార్యక్రమంలో 'బాలు' ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

తాను వెంకయ్య కంటే వయసులో పెద్దవాడినని, అయితే వి.ఆర్. కాలేజీలో ఆయనతో పాటు చదువుకుంటుండిన తన ఆప్తుల ద్వారా వెంకయ్య నాయకత్వపు లక్షణాల గురించి అప్పట్లోనే వింటూ వుండే వాడినని, ఆయన పుట్టిన జిల్లాలోనే తానూ పుట్టడం తనకు గర్వంగా వుందని అన్నారు. ప్రధానమంత్రి ఏ బాధ్యతలు అప్పజెప్పినా వాటిని సమర్ధవంతంగా నిర్వహించి, ప్రభుత్వ పథకాలను ప్రజల ముందు ఆవిష్కరించడంలో దిట్ట వెంకయ్యనాయుడని బాలు అన్నారు. ఆయన ఏమిటో, ఆయన సమర్ధత ఏమిటో, ఆయన ప్రతిభాపాటవాలు ఏ పాటివో తాను ప్రత్యేకంగా చెప్పనవసరం లేదని, శ్రమ, పట్టుదల, కార్య దక్షత, సమర్ధత, సామర్థ్యం అన్ని కలబోస్తే ఈరోజు మన ముందు సాక్షాత్కరించిన అనితర సాధ్యుడే వెంకయ్యనాయుడని యస్.పి.బాలసుబ్రహ్మణ్యం అన్నాడు.

ఛాంబర్ కార్యనిర్వాహక కార్యదర్శి కాట్రగడ్డ ప్రసాద్ నిర్వహణలో జరిగిన ఈ ఆత్మీయ కార్యక్రమంలో కేంద్ర సమాచార ప్రసారశాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకున్న అనంతరం తొలిసారిగా సినిమా రంగం గురించి వెంకయ్యనాయుడు మాట్లాడాడు. చలనచిత్ర పరిశ్రమ ఎదుర్కొంటున్న అన్ని సమస్యల పరిష్కారానికి తాను కృషి చేస్తానని, ముఖ్యంగా క్యాన్సర్ వ్యాధిలా పట్టిపీడిస్తున్న పైరసీ భూతాన్ని తరిమికొట్టడానికి తన శక్తివంచన లేకుండా పాటు పడతానని అన్నారు. నేటి సినిమాలలో హింస, శృంగారంతో పాటు అశ్లీలత, అసభ్యత శ్రుతిమించుతోందని, ఈ విషయంలో దర్శక నిర్మాతలు శ్రద్ధ తీసుకుని భారతీయ విలువలు, సంస్కృతీ సంప్రదాయాలను దృష్టిలో వుంచుకుని సినిమాలు తీయాలని సూచించారు. సెన్సార్ బోర్డు పరిధిని విస్తరించి ఎక్కువమంది సభ్యులను నియమించి ఈ పరిస్థితికి చెక్ పెట్టడానికి తాను ప్రయత్నిస్తానని వెంకయ్య హామీ ఇచ్చారు.

నిత్యం పని వత్తిడితో మానసిక సంఘర్షణతో వుండే మనిషికి ఉపశమనాన్ని ఇచ్చే కానుకగా సినిమా వుండాలే తప్ప, ద్వంద్వ అర్థాలతో కూడిన డైలాగులతో సమాజంలోని యువతని చెడుమార్గంలో పెట్టేలా ఉండకూడదని అన్నారు. ప్రజల మనోభావాలను వారి ఆకాంక్షలను మనసులో పెట్టుకుని నిర్మాతలు, దర్శకులు సినిమాలు తీస్తే ప్రభుత్వం కూడా అన్ని విధాలా వారి సమస్యలు తీర్చడానికి ఎల్లవేళలా ముందుం టుందని ఛాంబర్ సభ్యులకు సూచించారు.

ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్నాటక, కేరళ రాష్ట్రాలకు సంబంధించిన 'దక్షిణ భారత ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్' సభ్యులు కార్యక్రమంలో పాల్గొని వెంకయ్యనాయుడిని అభినందించారు. తెలుగు, తమిళ రంగాలకు చెందిన పలువురు సినీ తారలు, నిర్మాతలు, దర్శకులు, సాంకేతిక నిపుణులతో పాటు అనేకమంది వెంకయ్య ఆప్తులు పారిశ్రామిక వేత్తలు కార్యక్రమంలో పాల్గొని నాల్గవసారి రాజ్య


వెంకయ్యనాయుడిని అభినందిస్తున్న బీద మస్తాన్‌రావు

సభకు ఎంపికై సమాచారప్రసారాల శాఖ మంత్రిగా తొలిసారి చెన్నైకి వచ్చిన వెంకయ్యను అభినందనలతో ముంచెత్తారు.

యస్.పి.బాలుతో పాటు చెన్నైలో నివసించే నెల్లూరీయులు సీబ్రోస్ సుబ్బారెడ్డి, రవీంద్ర సన్నారెడ్డి, సి.యల్.నరసారెడ్డి, అనపల్లి అశోక్‌రెడ్డి, యస్.పి. చరణ్, డా॥ సి.రాజశేఖర్‌రెడ్డి, సింగీతం శ్రీనివాస రావు, మాజీ శాసనసభ్యులు, రాజధాని నిర్మాణ కమిటి సభ్యులు బీద మస్తాన్‌రావు తదితరులు కార్యక్రమానికి హాజరయ్యారు.

# ఇదేం చోద్యం 'వెంకటరమణా'...?

## ఆరోగ్య అధికారి అనారోగ్య చేష్టలు

నెల్లూరు మునిసిపాలిటీలో అవినీతి అక్రమాల పరంపర ఒక్క భవన నిర్మాణాల వరకే పరిమితమై వుందన్న అపోహను తొలగిస్తూ ఆరోగ్య శాఖ కూడా తన అవినీతి అవతారాన్ని ప్రదర్శిస్తోంది. ఏసిబి బారి నుండి మేయర్... షాడో మేయర్ ఆశీస్సులతో బయటపడ్డ మునిసిపల్ ఆరోగ్యశాఖాధికారి ఇప్పుడు వారి రుణం తీర్చుకునే పనిలో పడ్డట్లున్నాడు.

జూలై 18వ తేదీ ఈ ఆరోగ్యాధికారి అకస్మాత్తుగా నెల్లూరులో కొన్ని హోటళ్ళపై విరుచుకుపడ్డాడు. ఫ్రిజ్‌లో మాంసం, చేపలు పెడుతున్నారేంటి... అని ప్రశ్నించాడు. మీ కిచెన్ వెనుక వైపు పందికొక్కులు తిరుగుతున్నాయంటూ ఘీంకరించాడంట. పాపం ఈ హోటల్ నిర్వాహకుల దగ్గరకు నెలకొకసారి వచ్చి వెళ్ళే తమ శాఖ పందికొక్కులు ఈయనకు కనపడలేదేమో! అంతే కాదండోయ్ హోటళ్ళలో ఏ గంటకాగంటలో ఫ్రెష్‌గా మాంసం తెచ్చి వండాలని ఆదేశించాడట. ఇదేం చోద్యం వెంకటరమణా...? అంతర్జాతీయ మార్కెట్లో సైతం ఫ్రోజన్ మీట్‌నే వాడతారు. ఏగంటకాగంట మాంసం తెచ్చి వండరు. 7నక్షత్రాల హోటళ్ళలో సైతం ఇదే పద్ధతి అనుసరిస్తారు. ఈ మాత్రం కనీస పరిజ్ఞానం కూడా లేకుండా మీరెలా ఆరోగ్యాధికారి అయ్యారో అర్థంకాక ప్రజలు ఆలోచనలో పడుతున్నారు. మీరు నిజంగా నెల్లూరోళ్ళపై ప్రేమతో హోటళ్ళపై దాడి చేశారా...? లేక అవినీతి వూబిలో నుండి మిమ్మల్ని కాపాడి కరుణించిన మేయర్, షాడోమేయర్‌ల రుణం తీర్చుకునే క్రమంలో భాగంగా హోటళ్ళ యాజమాన్యాన్ని భయపెట్టడానికి దాడులు చేశారా? అన్న అనుమానం నెల్లూరు ఆహారప్రియులకు కలుగుతోంది.

మంగళవారం నాడు నెల్లూరు హోటల్స్ అసోసియేషన్ సభ్యులంతా మేయర్‌ని కలిశారు. ఇలా హోటళ్ళపై కక్షసాధింపు చర్యలకు పాల్పడడం సబబుకాదని, ఉద్దేశపూర్వకంగానే ఆరోగ్య అధికారి తమపై దాడులు చేసి ఆగం చేశాడని, ఇది మంచి పద్ధతి కాదని ఫిర్యాదు చేశారు.

నెల్లూరు నగరంలో వున్న కోట్లాది దోమలు, లక్షలాది ఎలుకలు, పందికొక్కులు, పందులను నియంత్రించాల్సిన బాధ్యత, ప్రజల ఆరోగ్యాన్ని సంరక్షించాల్సిన బాధ్యత కూడా ఈ అధికారిదే. ఈయనకు ఇవన్నీ కనిపించకుండా కేవలం తమ జీవనాధారం కోసం నడుపుకునే హోటళ్ళ సముదాయాలే కన్పించాయంటే ఈయనగారి టార్గెట్ ప్రజా ఆరోగ్యమా? లేక ఇంకేదైనానా...? ప్రజలే ఆలోచించుకోవాలి.

## శ్రీసిటి ఎం.డి రవిసన్నారెడ్డి సహకారంతో...

# రాజేశ్వరమ్మ సన్నిధిలో సెంట్రల్ ఏసి



శ్రీసిటి మేనేజింగ్ డైరెక్టర్ రవి సన్నారెడ్డి తన సొంత నిధులతో నెల్లూరు దుర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం సన్నిధిని సెంట్రల్ ఏసి చేయించారు. ఈ నెల 15వ తేదీన దేవస్థానానికి విచ్చేసిన ఆయన ఈ సెంట్రల్ ఏసిని ప్రారంభించారు. ఆలయ అధికారులు రవి సన్నారెడ్డికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలకగా రవిసన్నారెడ్డి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. శ్రీరాజ రాజేశ్వరమ్మ దర్శనం కోసం నిత్యం వేల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. భక్తుల సౌకర్యార్థం అమ్మవారి సన్నిధిలో సెంట్రల్‌ఏసి ఏర్పాటు చేయించిన రవి సన్నారెడ్డికి 'లాయర్' అభినందనలు.

# కేంద్ర సర్వీసులోకి జానకి, యువరాజ్





జిల్లా కలెక్టర్ శ్రీమతి యం.జానకి కేంద్ర ప్రభుత్వ సర్వీస్‌లోకి బదిలీ కానున్నారు. అలాగే ఆమె భర్త, విశాఖ పట్నం జిల్లా కలెక్టర్ యువరాజ్ కూడా కేంద్ర సర్వీసులోకి వెళ్లనున్నారు. జానకిని కేంద్రమంత్రి, నెల్లూరీయుడు యం.వెంకయ్యనాయుడు వ్యక్తిగత కార్యదర్శిగా నియమించడం దాదాపు ఖరారైంది.

2014 నవంబర్‌లో జానకి నెల్లూరుజిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఎంతో నిరాడంబరంగా కనిపించే ఆమె జిల్లా పరిపాలనపై తనదైన ముద్ర వేసుకున్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో చురుకైన పాత్ర పోషించారు. ముఖ్యంగా అన్ని ప్రభుత్వ శాఖలను గాడిలో పెట్టారు. నిద్రావస్థలో వున్న యంత్రాంగాన్ని కదిలించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన ఉన్నతాధికారులను సైతం ఆమె వదిలిపెట్టకుండా ప్రభుత్వానికి సరెండర్ చేశారు. తన వద్దకొచ్చిన ప్రజల సమస్యల విషయంలో వేగంగా స్పందించే వారు. జిల్లావాసిగా ఆమె పనితీరును గుర్తించిన వెంకయ్యనాయుడు కేంద్ర స్థాయిలో ఆమె సేవలు ఎంతో అవసరమని భావించి, ప్రత్యేక శ్రద్ధ తీసుకుని జానకి, యువరాజ్ దంపతులను కేంద్ర సర్వీసులోకి తీసుకువెళుతున్నట్లు సమాచారం.




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com